www.flashindianews.com

# ఫ్లాష్ ఇండియా

తెలుగు దినపత్రిక

FLASH INDIA TELUGU DAILY

RNI NO.APTEL/2010/33229

విలేకరులు కావలెను

18 సం॥ లుగా వెలువడుతున్న "ఫ్లాష్ ఇండియా" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు,నియోజకవర్గాల, మరియు మండలాల వారీగా విలేకరులు కావలెను..

సెల్ నెంబర్: 9951494039

సంపుటి : 17 | సంచిక : 163 | మంగళవారం 04.08.2026 | ఎడిటర్ : కొమరాజు శ్రీనివాసులు | పేజీలు : 08 | వెల రూ : 2/-

## అహంకారం ఎక్కువైంది తగ్గించుకోండి

### విగ్రహ ప్రతిష్ఠకు అడ్డొస్తే ఊరుకోను

సంతోషంతో రాలేదు... కోపంతో వచ్చాను

- విగ్రహ ప్రతిష్ఠ ఆలస్యంపై అసంతృప్తి వ్యక్తం చేసిన మాతంగి
- ఆరు నెలల్లో విగ్రహ ప్రతిష్ఠ పూర్తి చేయాలని హెచ్చరిక
- ఈ ఏడాది భారీ వర్షాలు, వరదలు వచ్చే అవకాశం ఉందని భవిష్యవాణి
- అగ్నిప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన
- తల్లిదండ్రులు పిల్లలపై మరింత శ్రద్ధ చూపాలని సూచించిన మాతంగి

05



## 'జంతర్ మంతర్' కు గుడ్ బై..

- జంతర్ మంతర్ నిరసనలపై సుప్రీంకోర్టు కీలక విచారణ
- నిరసనలకు ప్రత్యామ్నాయ వేదికపై కేంద్రానికి సూచనలు
- జంతర్ మంతర్‌కు బదులుగా కొత్త ప్రదేశం కేటాయించాలా?
- ధర్నాలతో స్థానికులకు ఇబ్బందులపై సుప్రీంకోర్టు ఆందోళన
- రాకపోకలు, అత్యవసర సేవలపై కోర్టు దృష్టి
- కేంద్రానికి నోటీసులు జారీ చేసిన ధర్మాసనం

05



## కానీ, షరతులు వర్తిస్తాయి..!

- లివ్-ఇన్ మహిళలకు సుప్రీంకోర్టు గుడ్ న్యూస్
- సహజీవన మహిళలకూ 498ఏ చట్ట రక్షణ
- లివ్-ఇన్ బంధాలపై సుప్రీంకోర్టు కీలక తీర్పు
- వివాహితలతో సమాన రక్షణకు గ్రీన్ సిగ్నల్
- భాగస్వామి వేధింపులపై 498ఏ కింద కేసు నమోదు చేయొచ్చు
- పెళ్లి లాంటి బంధాలకూ చట్టబద్ధ రక్షణ
- ప్రతి లివ్-ఇన్‌కు కాదు.. షరతులతోనే రక్షణ
- వివాహ ఉద్దేశం నిరూపిస్తేనే 498ఏ వర్తింపు

02

## న్యాయమూర్తుల సంఖ్య 38కి పెంపు..

## నిమ్స్‌లో రెండున్నరేళ్ల లో వెయ్యి

# రొబోటిక్ శస్త్రచికిత్సలు పూర్తి

### 90 శాతానికి పైగా రొబోటిక్ సర్జరీలు ఉచితమే

- రెండున్నరేళ్లలో అరుదైన ఘనత సాధించిన నిమ్స్
- రోబోటిక్ శస్త్రచికిత్సల్లో తెలంగాణకు మరో గర్వకారణం
- నిమ్స్ వైద్య బృందాన్ని అభినందించిన సీఎం రేవంత్
- ప్రభుత్వ వైద్యరంగంలో అత్యాధునిక సేవలకు నిదర్శనం
- 90 శాతానికి పైగా రొబోటిక్ సర్జరీలు ఉచితమే
- ఆరోగ్యశ్రీ, సీఎంఆర్ఎఫ్‌తో వేల మందికి నాణ్యమైన చికిత్స
- 2,000 కిడ్నీ మార్పిడి తర్వాత మరో చారిత్రక మైలురాయి
- ప్రపంచ స్థాయి వైద్య సేవల దిశగా నిమ్స్ ముందడుగు
- ప్రజా ప్రభుత్వ వైద్య సంకల్పానికి నిమ్స్ నిదర్శనం

02

దక్షిణ భారత ప్రభుత్వ రంగంలో తొలి రొబోటిక్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రపంచస్థాయి చికిత్సల దిశగా అడుగులు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** నిమ్స్‌లో రెండున్నరేళ్లలో వెయ్యి రొబోటిక్ శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తి అయ్యాయని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ ఘనత సాధించినందుకు నిమ్స్ డైరెక్టర్ రాహుల్ దేవరాజ్‌తో పాటు వైద్య బృందం, నర్సింగ్ సిబ్బంది, ఆపరేషన్ థియేటర్ బృందానికి అభినందనలు తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అత్యాధునిక వైద్య సేవలను సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలనే ప్రజా ప్రభుత్వ సంకల్పం నెరవేరిందని వ్యాఖ్యానించారు.నిమ్స్‌లో ఇప్పటివరకు నిర్వహించిన రొబోటిక్ సర్జరీల్లో 90 శాతానికి పైగా ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఉచితంగా నిర్వహించడం ప్రత్యేకంగా అభినందించాల్సిన విషయమని సీఎం పేర్కొన్నారు. ఇటీవలే రెండు వేల కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలను పూర్తి చేసిన నిమ్స్, ఇప్పుడు వెయ్యి రొబోటిక్ సర్జరీల మైలురాయిని చేరుకోవటం ద్వారా కొత్త రికార్డు నెలకొల్పిందని చెప్పుకొచ్చారు.



## పెద్ది మరణం చుట్టూ తెలంగాణ రాజకీయం..


# బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధం

అక్రమ కేసులతో పెద్దిను వేధించారు : బీఆర్ఎస్

'బతికున్నప్పుడు గౌరవించలేదు.. ఇప్పుడు రాజకీయాలా?' : కాంగ్రెస్

- పెద్ది మరణంపై తెలంగాణ రాజకీయాల్లో దుమారం
- బీఆర్ఎస్-కాంగ్రెస్ మధ్య ఆరోపణల యుద్ధం
- పెద్ది మరణానికి రాజకీయ ఒత్తిడే కారణమా?
- కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ తీవ్ర ఆరోపణలు
- 'అక్రమ కేసులతో పెద్దిను వేధించారు'
- సుప్రీంకోర్టు నోటీసులతో కొత్త చర్చ
- పెద్ది మరణం వెనుక రాజకీయ కోణమా?
- ప్రభుత్వంపై బీఆర్ఎస్ సంచలన ఆరోపణలు
- 'శవ రాజకీయాలు' అంటూ కాంగ్రెస్ ఎదురుదాడి
- పెద్ది విషయంలో బీఆర్ఎస్ ద్వంద్వ వైఖరేనన్న పొంగులేటి
- 'బతికున్నప్పుడు గౌరవించలేదు.. ఇప్పుడు రాజకీయాలా?'
- మంత్రి పదవి ఎందుకు ఇవ్వలేదని బీఆర్ఎస్‌ను నిలదీసిన కాంగ్రెస్

03







## సీఎం విద్యార్హతపై అనుమానాలు

### నోటిఫికేషన్లు అడిగితే ఎండ్రిన్ తాగమంటారా?

2 లక్షల ఉద్యోగాల హామీ.. భర్తీ మాత్రం శూన్యం

విద్యార్థుల కష్టాలు సీఎంకు ఎలా తెలుస్తాయి?

- రెండేళ్లైనా జాబ్ క్యాలెండర్ అమలు ఎక్కడ?
- 2 లక్షల ఉద్యోగాల హామీ.. భర్తీ మాత్రం శూన్యం
- ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతలో తీవ్ర నిరాశ
- 20 వేల ఖాళీలు.. నోటిఫికేషన్ మాత్రం 7 వేలకే!
- నిరుద్యోగులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందన్న కేటీఆర్
- 'నోటిఫికేషన్లు అడిగితే ఎండ్రిన్ తాగమంటారా?'
- సీఎం వ్యాఖ్యలపై కేటీఆర్ తీవ్ర ఆగ్రహం

03

## గుట్టుగా తాంత్రిక పూజలు..

రాష్ట్రం సర్వనాశనం కావాలని కోరుతుండ్రు..

రెచ్చగొట్టి ప్రాణాలు తీయించిన చరిత్ర మీది..

- హరీష్ రావుపై కాంగ్రెస్ సంచలన ఆరోపణలు
- 'తాంత్రిక హరీష్ రావు' అంటూ సామ రామ్మోహన్ రెడ్డి విమర్శలు
- క్షుద్రపూజలతో తెలంగాణకు కీడు కోరుతున్నారన్న ఆరోపణ
- తిరుచ్చి, శివమొగ్గ పూజలపై కాంగ్రెస్ ప్రశ్నలు
- ప్రత్యేక పూజల వెనుక అసలు ఉద్దేశం ఏంటి?
- హరీష్ రావు, కవిత సమాధానం చెప్పాలన్న కాంగ్రెస్

03




# రిజర్వేషన్లపై కీలక వ్యాఖ్యలు

## క్రిమినల్స్ స్వేచ్ఛగా తిరుగుతుంటే ఏం చేస్తున్నారు?

- ఢిల్లీ పోలీసులపై అభిజీత్ దీప్కే సంచలన ఆరోపణలు
- నిరసనను అణిచివేయడానికే ముందస్తు వ్యూహం
- 2,100 మంది నేరస్థులు తిరుగుతుంటే పోలీసులు ఏం చేశారు?
- 12 ఏళ్ల బాలికపై లాఠీఛార్జ్.. పోలీసుల తీరుపై ఆగ్రహం
- జంతర్ మంతర్ రాళ్లదాడి వెనుక కుట్ర ఉందా?
- రాళ్లతో ట్రక్కు ఎందుకు?.. పోలీసులు సమాధానం చెప్పాలి

02

దేశ రాజకీయ వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం క్రమంగా తగ్గిపోతోందని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపక అధ్యక్షుడు అభిజిత్ దీప్కే వ్యాఖ్యానించారు. రాజకీయ పార్టీలు ప్రజా సమస్యల పరిష్కారం కంటే పరస్పర విమర్శలు, వ్యక్తిగత దూషణలు, అధికార పోరాటాలకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయని ఆయన విమర్శించారు. ప్రజలకు అవసరమైన అంశాలపై చర్చలు జరగాల్సిన సమయంలో రాజకీయాలు వ్యక్తిగత ప్రయోజనాల చుట్టూ తిరుగుతున్నాయని, దీనివల్ల ప్రజలు రాజకీయాలపై నమ్మకం కోల్పోతున్నారని అన్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో మరో రాజకీయ పార్టీకి చోటు లేదనే అభిప్రాయాన్ని తాము అంగీకరించడం లేదని అభిజిత్ స్పష్టం చేశారు.






## నకిలీ బాబా బాగోతం..

యువతిని పెళ్లి చేసుకుని, గుప్తనిధుల పేరుతో లక్షలు కాజేసిన కేటుగాడు..!

- మెదక్ జిల్లాలో నకిలీ బాబా బాగోతం వెలుగులోకి
- మాయమాటలతో యువతిని వివాహం చేసుకున్న కేటుగాడు
- "గుప్తనిధులు బయటపడతాయి" అంటూ లక్షలు కాజేసిన మోసగాడు
- తవ్వకాల పేరుతో బాధిత కుటుంబం నుంచి భారీగా డబ్బు వసూలు
- విషయం బయటపడడంతో గ్రామస్తుల ఆగ్రహం

05

# రిజర్వేషన్లపై కీలక వ్యాఖ్యలు

## రిజర్వేషన్లను వ్యతిరేకించేవారు మేనేజ్‌మెంట్ కోటాపై ఎందుకు మాట్లాడరు?

**ఢిల్లీ:** ఢిల్లీ నిరసనల్లో రాళ్లదాడి, పోలీసుల చర్యలపై కాక్రోచ్ జనతా పార్టీ ఫౌండర్ అభిజీత్ దీప్కే తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పర్యవేక్షణలోని ఢిల్లీ పోలీసులపై ఆయన సంచలన ఆరోపణలు చేశారు. ఆందోళనకారులపై పోలీసులు విచక్షణారహితంగా దాడులు చేశారని ఆరోపించారు. నిరసన ప్రదర్శనలో 2,100 మంది నేరస్థులు తిరుగుతున్నారని స్వయంగా పోలీసులే చెబుతున్నారని మరి 12 ఏళ్ల బాలికపై లాఠీఛార్జ్ చేయడానికి చురుకుగా పని చేసిన పోలీసులు అసలైన నేరస్థులను అడ్డుకోవడంలో ఎందుకు దారుణంగా విఫలమయ్యారని ప్రశ్నించారు. అమిత్ షా హయాంలో ఇటువంటి ఘటనలు ఎలా జరుగుతాయని నిలదీశారు. ఇది కేవలం వారి వైఫల్యం మాత్రమే కాదని నిరసనను అణచివేయడానికి చేసిన ముందస్తు వ్యూహంలో భాగమే అని ఆరోపించారు. ఇవాళ మహారాష్ట్రలో మాట్లాడిన ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

**క్రిమినల్స్ స్వేచ్ఛగా తిరుగుతుంటే ఏం చేస్తున్నారు?:**

మా ఉద్యమాన్ని దెబ్బతీయడానికి, CJPకి చెడ్డపేరు తీసుకురావడానికి బయటి వ్యక్తులను తమ ఆందోళనల్లోకి పంపించారని ఆ గుండాలు ఢిల్లీ పోలీసులతో చేతులు కలిపారని అభిజీత్ సెన్సేషనల్ కామెంట్స్ చేశారు. సామాన్యులను తనిఖీ చేయకుండా లోపలికి అనుమతించని పోలీసులు.. ఏకంగా 2,100 మంది క్రిమినల్స్ స్వేచ్ఛగా తిరుగుతుంటే ఏం చేస్తున్నారు? అని ప్రశ్నించారు. జులై 19న జంతర్ మంతర్ వద్ద స్టేజీ వెనుక రాళ్లతో ఉన్న ట్రక్కును, జులై 20కి ముందే ఒక పాడైపోయిన వ్యాన్‌ను పోలీసులు ఎందుకు ఉంచారు?, ఆ మరుసటి రోజే రాళ్లదాడి జరిగిందనే వార్తలు రావడం వెనుక పోలీసుల కుట్ర ఉందనడానికి ఇదే నిదర్శనమని అభిజీత్ దీప్కే ఆరోపించారు.

**విద్య, రిజర్వేషన్లపై అభిజీత్ స్పందన:**

రిజర్వేషన్ల అంశంపై స్పందిస్తూ.. పేద పిల్లలకు విద్య అందడం వల్ల వచ్చే నష్టమేంటి? అని నిలదీశారు. రిజర్వేషన్ల వల్ల సీట్లు తగ్గుతున్నాయని గగ్గోలు పెట్టే బదులు, విద్యాసంస్థల్లో సీట్ల సంఖ్యను పెంచాలని ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. రిజర్వేషన్లను వ్యతిరేకించేవారు మేనేజ్‌మెంట్ కోటాపై ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. దేశంలో విద్య సామాన్యులకు అందుబాటులో లేకుండా పోయిందని, ప్రైవేట్ పాఠశాలల ఫీజులపై పరిమితి (క్యాపింగ్) విధించాలన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల మౌలిక వసతులను మెరుగుపరిచి నాణ్యమైన విద్యను అందించాలని డిమాండ్ చేశారు.

**సీజేపీ రాజకీయ పార్టీపై కీలక ప్రకటన**

దేశ రాజకీయ వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం క్రమంగా తగ్గిపోతోందని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపక అధ్యక్షుడు అభిజిత్ దీప్కే వ్యాఖ్యానించారు. రాజకీయ పార్టీలు ప్రజా సమస్యల పరిష్కారం కంటే పరస్పర విమర్శలు, వ్యక్తిగత దూషణలు, అధికార పోరాటాలకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయని ఆయన విమర్శించారు. ప్రజలకు అవసరమైన అంశాలపై చర్చలు జరగాల్సిన సమయంలో రాజకీయాలు వ్యక్తిగత ప్రయోజనాల చుట్టూ తిరుగుతున్నాయని, దీనివల్ల ప్రజలు రాజకీయాలపై నమ్మకం కోల్పోతున్నారని అన్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో మరో రాజకీయ పార్టీకి చోటు లేదనే అభిప్రాయాన్ని తాము అంగీకరించడం లేదని అభిజిత్ స్పష్టం చేశారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేసే ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక అవసరమని పేర్కొన్నారు. అందులో భాగంగానే క్రాకట్ జనతా పార్టీని స్థాపించినట్లు తెలిపారు. సంప్రదాయ రాజకీయాలకు భిన్నంగా పారదర్శకత, ప్రజల భాగస్వామ్యం, బాధ్యతాయుత పాలన లక్ష్యంగా పార్టీ పనిచేస్తుందని చెప్పారు. పార్టీ నిర్మాణాన్ని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు చర్యలు చేపడుతున్నామని అభిజిత్ వెల్లడించారు. ఈ క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో పార్టీని విస్తరించడంపై దృష్టి సారించామని తెలిపారు. అదే సమయంలో కొత్త సభ్యత్వ నమోదును కూడా వేగవంతం చేస్తున్నామని చెప్పారు. పార్టీ సభ్యత్వ నమోదు కోసం కేవలం రూ. 1 మాత్రమే ఫీజుగా నిర్ణయించినట్లు వెల్లడించారు. ఆన్‌లైన్ ద్వారా సభ్యత్వం పొందే అవకాశం కల్పించామని, సభ్యత్వం పొందిన ప్రతి ఒక్కరూ పార్టీ కార్యకలాపాల్లో భాగస్వాములు కావచ్చని పేర్కొన్నారు. రాజకీయాల్లో మార్పు రావాలంటే ప్రజలే ముందుకు రావాలని అభిజిత్ డీఎస్ పిలుపునిచ్చారు. ప్రజల సమస్యలను కేంద్రంగా చేసుకుని కొత్త రాజకీయ సంస్కృతిని తీసుకురావడమే తమ పార్టీ లక్ష్యమని ఆయన తెలిపారు. ప్రజల విశ్వాసాన్ని తిరిగి పొందే రాజకీయ వ్యవస్థను నిర్మించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.



## మైనార్టీ హాస్టల్‌లో కలకలం..

**దుండిగల్,ఫ్లాష్ ఇండియా :** దుండిగల్ పరిధిలోని బౌరంపేటలో ఉన్న తెలంగాణ రాష్ట్ర మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ హాస్టల్‌లో ఇద్దరు మైనర్ విద్యార్థులపై అదే పాఠశాలలో చదువుతున్న ముగ్గురు మైనర్ విద్యార్థులు లైంగిక దాడికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దుండిగల్ పోలీసుల వివరాల ప్రకారం, ఈ నెల 1వ తేదీ (శనివారం) ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. అయితే, ఘటన జరిగిన వెంటనే పాఠశాల యాజమాన్యం పోలీసులకు సమాచారం ఇవ్వకుండా గోప్యంగా ఉంచినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఘటన జరిగిన రోజే బాధిత విద్యార్థులు తమ స్వస్థలాలకు వెళ్లగా, అక్కడ తమ తల్లిదండ్రులకు జరిగిన విషయాన్ని వివరించారు. దీంతో సోమవారం బాధితుల తల్లిదండ్రులు దుండిగల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు నిందితులపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు దుండిగల్ సీఐ బాల్‌రెడ్డి తెలిపారు.

**ఘటనను గోప్యంగా ఉంచారా?**

ఘటన జరిగిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వకుండా పాఠశాల ప్రిన్సిపాల్ గోప్యంగా ఉంచినట్లు సమాచారం. అలాగే బాధిత విద్యార్థులను వారి స్వస్థలాలకు పంపించడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇది ఉద్దేశపూర్వకంగా జరిగిందా? లేక నిర్లక్ష్యం వల్ల జరిగిందా? అనే అంశాలపై విచారణ జరగాల్సి ఉంది. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా వెలుగులోకి రావాల్సి ఉంది. పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది.

# న్యాయమూర్తుల సంఖ్య 38కి పెంపు..

**ఢిల్లీ :** దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టులో పెరుగుతున్న కేసుల భారాన్ని తగ్గించి, బాధితులకు వేగంగా న్యాయం అందించేందుకు ఉద్దేశించిన కీలక బిల్లుకు పార్లమెంట్ లోక్‌సభ ఆమోదం తెలిపింది. బిల్లుపై చర్చను కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ ఆరంభించారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష సభ్యులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కీలకమైన బిల్లుపై చర్చలో పాల్గొనాలని సభ్యులను స్పీకర్ వారిని రిక్వెస్ట్ చేయగా.. అయినా వినకపోవడంతో బిల్లుపై చర్చ లేకుండానే స్పీకర్ ఆమోదించారు. దీంతో సుప్రీంకోర్టులో ప్రధాన న్యాయమూర్తితో సహా మొత్తం న్యాయమూర్తుల సంఖ్యను 34 నుంచి 38కి పెంచే ప్రతిపాదనకు దిగువ సభ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయితే, గతంలో 2019లో సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను సీజేఐతో కలిపి 31 నుంచి 34కి పెంచారు. ఆ తర్వాత దాదాపు ఏడేళ్ల విరామం అనంతరం మళ్లీ జడ్జిల సంఖ్యను పెంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

**జడ్జీల సంఖ్య పెరిగింది ఇలా..**

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 124(1) ప్రకారం సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను సవరించడం.. పెంచే అధికారం కేవలం పార్లమెంటుకు మాత్రమే ఉంటుంది. 1950లో రాజ్యాంగం అమలుల్లోకి వచ్చినప్పుడు సీజేఐతో సహా మొత్తం 8 మంది జడ్జిలు మాత్రమే ఉండేవారు. ఆ తర్వాత 1956లో సంఖ్య 10కి, 1960లో 13కు, 1977లో 18కి, 1986లో 26కు, 2009లో 31కి, 2019లో 34కు, 2026లో ప్రస్తుతం సీజేఐతో కలిపి 37 మంది జడ్జిలు ఉన్నారు. అయితే, సుప్రీంకోర్టులో ప్రస్తుతం వేలాది రాజ్యాంగ, సివిల్, క్రిమినల్ పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నాయి. రాజ్యాంగ ధర్మాసనాలు (Bench) సక్రమంగా నిర్వహించడానికీ, రోజువారీ విచారణలను వేగవంతం చేయడానికీ ఈదనంగా మరో నలుగురు న్యాయమూర్తుల నియామకం ఎంతో దోహదపడుతుందని న్యాయ నిపుణులు భావిస్తున్నారు.

# కానీ, షరతులు వర్తిస్తాయి..!

**ఢిల్లీ :** సహజీవనంలో ఉన్న మహిళలకు సుప్రీంకోర్టు గుడ్ న్యూస్ చెప్పింది. వారికి కూడా వివాహిత మహిళలకు వర్తించే సెక్షన్ వర్తిస్తుందని పేర్కొంటూ సంచలన తీర్పు వెలువరించింది. పెళ్లి చేసుకోకుండా ఇద్దరి ఇష్టంతో సహజీవనంలో ఉన్నప్పుడు, భాగస్వామిపై హింసకు పాల్పడితే భారతీయ శిక్షా స్మృతిలోని సెక్షన్ 498A (గృహ హింస, వేధింపులు) కింద కేసు నమోదు చేసి విచారించవచ్చని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ఎన్. కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం ఈ కీలక తీర్పును వెలువరించింది. చట్టబద్ధంగా జరిగిన పెళ్లిళ్లకు మాత్రమే సెక్షన్ 498A రక్షణ పరిమితం కాదని, పెళ్లిని పోలి ఉండే లివ్-ఇన్ బంధాలకు కూడా ఇది వర్తిస్తుందని ధర్మాసనం తేల్చిచెప్పింది. అయితే.. ప్రతి లివ్-ఇన్ సంబంధానికి ఈ సెక్షన్ వర్తించదని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. సెక్షన్ 498A కింద చట్టపరమైన రక్షణ కోరే మహిళ.. తమ బంధం వివాహం వంటిదని, పరస్పరం పెళ్లి చేసుకోవాలనే స్పష్టమైన ఉద్దేశం ఉండిందని ముందుగా నిరూపించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. తమపై నమోదైన క్రిమినల్ కేసులను కొట్టివేసేందుకు కర్ణాటక హైకోర్టు నిరాకరించడాన్ని సవాలు చేస్తూ డాక్టర్ లోకేష్ బి. హెచ్., ఇతరులు దాఖలు చేసిన అప్పీలును సుప్రీంకోర్టు కొట్టివేస్తూ ఈ వ్యాఖ్యలు చేసింది. తనకు మొదటి పెళ్లి అయిన విషయాన్ని దాచిపెట్టి లోకేష్ తనను రెండో పెళ్లి చేసుకున్నాడని, ఆ తర్వాత ఆయనతో పాటు ఆయన కుటుంబ సభ్యులు అదనపు కట్నం కోసం వేధించారని, అలాగే తనపై భౌతిక దాడికి పాల్పడి నిప్పు పెట్టేందుకు ప్రయత్నించారని బాధితురాలు ఆరోపించింది. ఈ ఆరోపణల ఆధారంగా వారిపై కేసులు నమోదయ్యాయి. మొదటి పెళ్లి అమలులో ఉండగానే జరిగిన రెండో వివాహం చెల్లకుండా పోతుంది కాబట్టి, సెక్షన్ 498A పరిధిలో తాను "భర్త"గా పరిగణించబడనని నిందితుడు లోకేష్ కోర్టులో వాదించాడు. అయితే, చెల్లని లేదా రద్దు అయ్యే వివాహాలకు, అలాగే పెళ్లి వంటి లివ్-ఇన్ బంధాలకు కూడా ఈ చట్టం వర్తిస్తుందని కర్ణాటక హైకోర్టు స్పష్టం చేసింది. హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థిస్తూ, వివాహం చేసుకోవాలనే ఉద్దేశం ఉందని స్పష్టమైన ఆధారాలు ఉన్న కేసుల్లో మాత్రమే ఇటువంటి రక్షణ లభిస్తుందని నొక్కిచెప్పింది. మహిళలపై జరిగే క్రూరత్వాన్ని అరికట్టడానికి, రాజ్యాంగం కల్పించిన సమానత్వ హక్కును కాపాడటానికి సెక్షన్ 498Aరూపుదిద్దుకుందని సుప్రీంకోర్టు వివరించింది. వివాహాన్ని పోలిన బంధంలో ఉన్న మహిళలకు ఈ చట్టపరమైన రక్షణను నిరాకరిస్తే, అది చట్టం యొక్క అసలు లక్ష్యానికి విరుద్ధంగా మారడమే కాకుండా రాజ్యాంగంలోని ఆర్టికల్ 14ను ఉల్లంఘించినట్లవుతుందని అత్యున్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. గృహహింస నిరోధక చట్టం (DV Act, 2005) ఇప్పటికే లివ్-ఇన్ మహిళలకు రక్షణ కల్పిస్తోంది కాబట్టి సెక్షన్ 498A అవసరం లేదన్న వాదనను ధర్మాసనం తోసిపుచ్చింది.

# నిమ్స్‌లో రెండున్నరేళ్లలో వెయ్యి రోబోటిక్ శస్త్రచికిత్సలు పూర్తి

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** నిమ్స్‌లో రెండున్నరేళ్లలో వెయ్యి రోబోటిక్ శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తి అయ్యాయని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ ఘనత సాధించినందుకు నిమ్స్ డైరెక్టర్ రాహుల్ దేవరాజ్‌తో పాటు వైద్య బృందం, నర్సింగ్ సిబ్బంది, ఆపరేషన్ థియేటర్ బృందానికి అభినందనలు తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అత్యాధునిక వైద్య సేవలను సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలనే ప్రజా ప్రభుత్వ సంకల్పం నెరవేరిందని వ్యాఖ్యానించారు. నిమ్స్‌లో ఇప్పటివరకు నిర్వహించిన రోబోటిక్ సర్జరీల్లో 90 శాతానికి పైగా ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఉచితంగా నిర్వహించడం ప్రత్యేకంగా అభినందించాల్సిన విషయమని సీఎం పేర్కొన్నారు. ఇటీవలే రెండు వేల కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలను పూర్తి చేసిన నిమ్స్, ఇప్పుడు వెయ్యి రోబోటిక్ సర్జరీల మైలురాయిని చేరుకోవటం ద్వారా కొత్త రికార్డు నెలకొల్పిందని చెప్పుకొచ్చారు. వైద్య రంగంలో నిమ్స్ మరిన్ని మైలురాళ్లు సాధించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు.

**ప్రభుత్వాస్పత్రుల్లో అత్యాధునిక వైద్య సేవలు: దామోదర**

నిమ్స్‌లో రెండున్నరేళ్లలో 1,000 రోబోటిక్ సర్జరీలు పూర్తి అయ్యాయని తెలంగాణ మంత్రి దామోదర రాజనర్సింహ వ్యాఖ్యానించారు. ఈరోజు (సోమవారం) రాష్ట్ర సచివాలయంలో నిమ్స్ వైద్య బృందం మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా వారిని మంత్రి దామోదర అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర మాట్లాడారు. ప్రభుత్వాస్పత్రుల్లో అత్యాధునిక వైద్య సేవలకు నిదర్శనమని పేర్కొన్నారు. ఇప్పటికే 2,000 కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలను నిమ్స్ పూర్తి చేసిందని వెల్లడించారు. దక్షిణ భారత ప్రభుత్వ రంగంలో తొలి రోబోటిక్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్‌ను నిమ్స్ చేసిందని మంత్రి దామోదర చెప్పుకొచ్చారు. 90 శాతానికి పైగా రోబోటిక్ సర్జరీలు ఆరోగ్యశ్రీ, సీఎంఆర్‌ఎఫ్ ద్వారా ఉచితమని తెలిపారు. యూరాలజీలో 590, గ్యాస్ట్రోలో 248, ఆంకాలజీలో 162 రోబోటిక్ సర్జరీలు జరుగుతాయని వివరించారు. ఎంఎన్‌జేలోనూ విజయవంతంగా రోబోటిక్ సర్జరీలు నిర్వహిస్తున్నట్లు చెప్పుకొచ్చారు. కొత్త టిమ్స్, గాంధీ, ఉస్మానియాలో రోబోటిక్ ఆపరేషన్ థియేటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రపంచ స్థాయి వైద్య సేవలను అందుబాటులోకి తెస్తున్నామని మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు.




## కొత్త కార్పొరేషన్‌కు పాత గుర్తింపే..!

**కాప్రా,ఫ్లాష్ ఇండియా :** పరిపాలన సౌలభ్యం కోసం గతంలో ఉన్న గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ)ను మూడు మున్సిపల్ కార్పొరేషన్లుగా విభజించిన అధికారులు, ఆయా కార్యాలయాల్లో బోర్డులను మార్చడంలో మాత్రం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. గత ఏడాది డిసెంబర్ 25న జీహెచ్‌ఎంసీ ని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్లుగా విభజించారు. అయితే, విభజన జరిగి ఎనిమిది నెలలు గడిచినా అనేక సర్కిల్ కార్యాలయాల్లో ఇప్పటికీ పాత జీహెచ్‌ఎంసీ బోర్డులే కొనసాగుతున్నాయి. మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కాప్రా సర్కిల్ కార్యాలయంపై ఇప్పటికీ "సర్కిల్--1 జీహెచ్‌ఎంసీ" అనే పాత బోర్డే ఉండటం గమనార్హం. దీంతో కార్యాలయానికి వచ్చే ప్రజలు అయోమయానికి గురవుతున్నారు. మున్సిపల్ కార్పొరేషన్ల విభజనను వేగంగా అమలు చేసిన అధికారులు, కార్యాలయాల బోర్డులను మార్చడంలో మాత్రం అదే వేగం చూపలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, సంబంధిత మున్సిపల్ కార్పొరేషన్ పేర్లతో కొత్త బోర్డులను ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ఇకపై మరో పోరాటం



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలని ఒకవేళ బకాయిలు చెల్లించకపోతే మిలిటెంట్ పోరాటం చేస్తామని తెలంగాణ ప్రభుత్వాన్ని బీజేపీ ఎంపీ ఆర్. కృష్ణయ్య హెచ్చరించారు. ఇవాళ హయ్యర్ ఎడ్యుకేషన్ ఆఫీస్ ముట్టడికి బీసీ విద్యార్థి సంఘం పిలుపు ఇచ్చింది. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన ఆర్. కృష్ణయ్య.. ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు చెల్లించాలని అడిగితే తాను ఏపీ నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్నాను కాబట్టి ఏపీలో రీయింబర్స్ మెంట్ కోసం పోరాటం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అంటున్నారని మండిపడ్డారు.

**ఇకపై మరో పోరాటం:**

ఏపీలో బకాయిలు ఉన్నప్పటికీ అక్కడ స్కీమ్ చాలా బాగుందని ఏపీలో పూర్తి ఫీజులు ప్రభుత్వమే చెల్లిస్తుంటే తెలగాణలో ఇంజినీరింగ్ విద్యార్థులకు రూ. 35 వేలు, డిగ్రీకి రూ. 15 వేలు మాత్రమే ఇస్తున్నారుని ఇక్కడ కూడా ఏపీ తరహాలో పథకం తెలంగాణలో కూడా అమలు చేయాలని అన్నారు.య ఇకపై బకాయిల విడుదలతో పాటు ఏపీ తరహాలో ఎంత ఫీజు అంటే అంత చెల్లించేలా నిర్ణయం తీసుకునేందుకు పోరాటం చేస్తామన్నారు.



## ఎరువులకు ఇక బుకింగ్ తప్పనిసరి

**వర్గల్,ఫ్లాష్ ఇండియా :** సిద్దిపేట జిల్లా వర్గల్ మండలంలోని రైతులు ఈ నెల ఆగస్టు 6వ తేదీ నుంచి యూరియా, డీఏపీ, ఎంఓపీ, కాంప్లెక్స్ తదితర ఎరువులను ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫర్టిలైజర్ సేల్స్ యాప్ ద్వారానే కొనుగోలు చేయాల్సి ఉంటుందని మండల వ్యవసాయ అధికారి శేషశయన తెలిపారు. ఈ విధానం ద్వారా ఎరువుల దుర్వినియోగం, అక్రమ నిల్వలు, పక్కదారి పట్టడాన్ని సమర్థవంతంగా అరికట్టవచ్చన్నారు. ఎరువుల కొనుగోలు సమయంలో రైతులు ఆధార్ కార్డు, రైతు రిజిస్ట్రీ ఐడీ, ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ నంబర్ తప్పనిసరిగా అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఈ కొత్త విధానం పై అవగాహన కల్పించేందుకు సోమవారం గౌరారం రైతు వేదికలో మండలంలోని ఎరువుల డీలర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు సునీత, భారతితో పాటు పలువురు ఎరువుల డీలర్లు పాల్గొన్నారు.

ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి
7730032999
flashindiadaily@gmail.com

# సీఎం విద్యార్హతపై అనుమానాలు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** కాంగ్రెస్ ప్రభుత్వ బాధ్యతారాహిత్యం, నెరవేర్చని హామీల వల్ల తెలంగాణలో నిరుద్యోగులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీలపై విమర్శలు గుప్పించారు. ఎన్నికల సమ-యంలో 'యూత్ డిక్లరేషన్' పేరిట కాంగ్రెస్ ఊదరగొట్టిందని కేటీఆర్ మండిపడ్డారు. అసెంబ్లీ సాక్షిగా జాబ్ క్యాలెండర్ విడుదల చేసి రెండేళ్లు కావస్తున్నా ఇంతవరకు ఉద్యోగాల భర్తీ చేపట్టలేదని దుయ్యబట్టారు. ఉద్యోగాలు రాకపోవడంతో తీవ్ర మన స్థాపానికి గురై ఒక యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 20 వేల పోలీసు ఉద్యోగాలు ఖాళీగా ఉంటే, కేవలం 7 వేల పోస్టులకు మాత్రమే నోటీఫికేషన్ ఇవ్వడం నిరుద్యోగులను మోసం చేయడమేనని స్పష్టం చేశారు.

**నోటిఫికేషన్లు అడిగితే ఎండ్రిన్ తాగమంటారా?**

"హైదరాబాద్లోని అశోక్ నగర్ నడిబొడ్డున రాహుల్ గాంధీ నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి?" అని కేటీఆర్ ప్రశ్నించారు. 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక కనీసం 10 వేల పోస్టులు కూడా భర్తీ చేయలేదని ఆరోపించారు. నోటిఫికేషన్లు వేయాలని నిరుద్యోగులు డిమాండ్ చేస్తుంటే.. సీఎం రేవంత్ రెడ్డి బాధ్యతారాహిత్యంగా 'ఎండ్రిన్ తాగి చావండి' అని మాట్లాడటం దారుణమన్నారు. ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లను 'క్రిమినల్ వేస్ట్' అని సంబోధించిన సీఎం రేవంత్ రెడ్డికే దేశంలో అత్యధిక క్రిమినల్ కేసులు ఉన్నాయని. ఆయనే అసలైన క్రిమినల్ వేస్ట్ అని కేటీఆర్ విమర్శించారు. ఢిల్లీలో రాజ్యాంగ ప్రతి పట్టుకుని తిరిగే రాహుల్ గాంధీకి తెలంగాణలో నిరుద్యోగులకు జరుగుతున్న అన్యాయం, సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు కనిపించడం లేదా అని నిలదీశారు. యూత్ డిక్లరేషన్‌లో ఇచ్చిన 24 హామీలలో ఒక్కటి కూడా నెరవేర్చలేదని కేటీఆర్ ధ్వజమెత్తారు.

**రేవంత్ విద్యార్హతపై అనుమానాలు..**

"రేవంత్ రెడ్డి అసలు ఏం చదివారో కూడా నాకు అనుమానంగానే ఉంది. ఎవరి సహాయం లేకుండా ఆయన తన ఎన్నికల అఫిడవిట్ నింపగలరా? కనీసం ఒక్క ఉద్యోగ ఇంటర్వ్యూ అయినా ఫేస్ చేశారా? అసలు విద్యార్థుల కష్టాలు, వారి శ్రమ రేవంత్ రెడ్డికి ఏం తెలుసు?" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ హయాంలో కరోనా సంక్షోభం వచ్చినా, కేంద్రం నుంచి నిధులు ఆగిపోయినా నిరుద్యోగుల కోసం 2 లక్షలకు పైగా ఉద్యోగాలు భర్తీ చేశామని గుర్తుచేశారు. ఇప్పటికైనా కాలయాపన చేయకుండా 2 లక్షల ఉద్యోగాలను ఎప్పుడు భర్తీ చేస్తారో సీఎం రేవంత్ రెడ్డి. రాహుల్ గాంధీ వెంటనే సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో డ్రగ్-ఫ్రీ ప్రతిజ్ఞ మెగా క్యాంపెయిన్

## యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి:ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** మిర్యాలగూడ పట్టణంలోని బ్రహ్మకుమారీస్ సబ్ జోన్ ఆధ్వర్యంలో "నషా ముక్త్ భారత్ అభియాన్ మరియు మిషన్ స్పందన్" కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన"10 కోట్ల డ్రగ్-ఫ్రీ ప్రతిజ్ఞ మెగా క్యాంపెయన్ " కార్యక్రమంలో మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.అనంతరం డ్రగ్స్, మత్తు పదార్థాల వినియోగం సమాజానికి,ముఖ్యంగా యువత భవిష్యత్తుకు తీవ్ర ముప్పుగా మారుతుందని పేర్కొన్నారు.మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని, ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవాలని యువతకు పిలుపునిచ్చారు.దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న "10 కోట్ల డ్రగ్-ఫ్రీ ప్రతిజ్ఞ మెగా క్యాంపెయిన్"వంటి కార్యక్రమాలు సమాజంలో అవగాహన పెంపొందించడంతో పాటు యువతను సన్మార్గంలో నడిపించేందుకు ఎంతో దోహదపడతాయని అన్నారు.ఇలాంటి సామాజిక చైతన్య కార్యక్రమాలను నిర్వహిస్తున్న బ్రహ్మకుమారీస్ సంస్థను ఆయన అభినందించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్,కాంగ్రెస్ నాయకులుచిలుకూరి బాలకృష్ణ,గుడిపాటి నవీన్,బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు,ప్రజాప్రతినిధులు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ వారు,వివిధ సంఘాల నాయకులు మరియు భక్తులు పాల్గొన్నారు.

# రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలి

**గద్వాల,ఫ్లాష్ ఇండియా :** ప్రజావాణికి వచ్చే అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్ కుమార్ రెడ్డి, రాజ్ కుమార్లతో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.ఈ వారం మొత్తం 70 ఫిర్యాదులు ప్రజావాణిలో అందాయని కలెక్టర్ తెలిపారు. గత కొన్ని వారాలుగా వచ్చిన అర్జీల పరిష్కారంలో పురోగతి కనిపిస్తున్నప్పటికీ, పెండింగ్‌లో ఉన్న అన్ని దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాతో పాటు సీఎం ప్రజావాణికి వచ్చిన అర్జీలను కూడా సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు.మండల స్థాయిలో వచ్చిన ఫిర్యాదులను అక్కడికక్కడే పరిష్కరించాలని, ముఖ్యంగా భూ సంబంధిత సమస్యలపై వచ్చిన దరఖాస్తులను సంబంధిత మండలాల రెవెన్యూ అధికారులు త్వరితగతిన పరిష్కరిస్తే ప్రజలు జిల్లా కేంద్రానికి రావాల్సిన అవసరం ఉండదని పేర్కొన్నారు.గతంలో ప్రజావాణిలో ఇచ్చిన ఫిర్యాదులు పరిష్కారం కాకపోవడంతో పలువురు ప్రజలు అదే సమస్యలపై మళ్లీ ప్రజావాణికి వస్తున్నారని, ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

అలాగే, ప్రతి శాఖ అధికారి ప్రతి బుధవారం తమ సిబ్బందితో సమావేశం నిర్వహించి, తమ శాఖ పరిధిలో వచ్చిన ప్రజావాణి అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# ఎంపీ రఘునందన్ ఏం చెప్పారంటే..

**ఢిల్లీ :** లోక్‌సభలో సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య సవరణ బిల్లు-2026 ఆమోదం పొందడంపై బీజేపీ ఎంపీ రఘునందన్ రావు హర్షం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టులో దాదాపు లక్ష పెండింగ్ కేసులు ఉన్నాయని, వాటిని పరిష్కరించేందుకు కేంద్రం చర్యలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఒక్క సంవత్సరంలో 65 వేల కేసులను డిస్పోజ్ చేస్తే.. 75 వేల కొత్త కేసులు నమోదవుతున్నాయని ఈ సందర్భంగా ఎంపీ తెలిపారు. దీంతో కేసుల విచారణను వేగవంతం చేయాలనే లక్ష్యంతోనే సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య పెంపు బిల్లును కేంద్రం తీసుకొచ్చిందని రఘునందన్ రావు చెప్పుకొచ్చారు.జడ్జిల సంఖ్య పెంపుతో కక్షిదారులకు ఇబ్బందులు కలగకుండా కేంద్రం చర్యలు తీసుకుంటుందని ఎంపీ రఘునందన్ రావు చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో 2019లో ఒకసారి, ఇప్పుడు మరోసారి జడ్జిల సంఖ్య పెంచారని తెలిపారు. దేశ ప్రజలకు వేగంగా న్యాయం జరగాలనే ఉద్దేశంతోనే ఈ బిల్లులను కేంద్రం తీసుకొచ్చిందని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే ప్రజలకు సత్వర న్యాయం అందించేందుకు కేంద్రం రూ.7 వేల కోట్లు ఖర్చు చేసిందని ప్రశంసించారు. కొలిజియం విధానానికి వ్యతిరేకంగా సర్వీస్ కమిషన్ తీసుకురావాలని గతంలో ప్రయత్నం జరిగిందని, అయితే సుప్రీంకోర్టు దానిని కొట్టివేసిందని రఘునందన్ రావు గుర్తు చేశారు. కొలిజియంలో మరింత పారదర్శకత అవసరమని, అందుకోసం జ్యుడీషియల్ కమిషన్ ఏర్పాటు చేస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు.జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ఇటీవల చేసిన వ్యాఖ్యలను దేశ ప్రజల అభిప్రాయంగా తాను భావిస్తున్నానని, వాటిని స్వాగతిస్తున్నట్లు రఘునందర్ రావు పేర్కొన్నారు. ఆయన అభిప్రా-యానికి అనుగుణంగా మోదీ ప్రభుత్వం చర్యలు తీసుకునే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. మరోవైపు E-20 పెట్రోల్ అంశంపైనా ఎంపీ స్పందించారు. E-20తో లాభాలు ఉన్నాయని చెప్పిన ఆయన.. త్వరలోనే అపోహలపై స్పష్టత ఇస్తామని ధీమా వ్యక్తం చేశారు. యూఏఈకి చెందిన ఓ కంపెనీతో త్వరలోనే భారత్‌లో కార్యక్రమం నిర్వహించి అపోహలను తొలగించే ప్రయత్నం చేస్తామని తెలిపారు.

# రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి..

**శంకర్‌పల్లి,ఫ్లాష్ ఇండియా :** రైతులు పండించిన పంటలకు మార్కెట్‌లో గిట్టుబాటు ధర కల్పించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని మార్కెట్ చైర్‌పర్సన్ గోవిందమ్మ అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. సోమవారం శంకర్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ సమావేశ మందిరంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు పండించిన పంటను మార్కెట్‌లో అమ్ముకోవడానికి తీసుకువస్తే గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు వారికి మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత కమిటీ పై ఉంటుందని తెలిపారు. రైతులకు సీజన్‌లో కావలసిన ఎరువులు, యూరియా సకాలంలో అందించే విధంగా వ్యవసాయ అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. రైతులకు సబ్సిడీ పై డ్రిప్ పరికరాల పంపిణీతో పాటు పండించిన పంటలను రక్షించుకునేందుకు కార్పెట్లు, పందిరీలు అందించే విధంగా చర్యలు చేపట్టాలని ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చంద్రమోహన్, మార్కెట్ కమిటీ కార్యదర్శి ఐశ్వర్య లక్ష్మి, వ్యవసాయ అధికారి చైతన్య, డైరెక్టర్లు పాల్గొన్నారు.

# గుట్టుగా తాంత్రిక పూజలు..

## రాష్ట్రం సర్వనాశనం కావాలని కోరుతుండ్రు..



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత తన్నీరు హరీష్ రావు టార్గెట్‌గా టీపీసీసీ (ప్రజజ) మీడియా కమిటీ చైర్మన్ సామా రామ్మోహన్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. రాష్ట్రంలో తాము అధికారంలో లేమని, తెలంగాణ ప్రజలు, రైతులు సర్వనాశనం కావాలనే దుర్బుద్ధితో హరీష్ రావు విడతల వారీగా క్షుద్రపూజలు, తాంత్రిక పూజలు చేయిస-్తున్నారని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై, ప్రజలపై కక్ష సాధించేందుకే ఈ రకమైన చర్యలకు దిగుతున్నారని, ఇప్పటినుంచి ఆయన పేరును 'తాంత్రిక హరీష్ రావు' అని పిలవాలని కామెంట్ చేశారు.

**గుట్టుగా తాంత్రిక పూజలు..**

హరీష్ రావు ఇటీవల నిర్వహించిన ప్రత్యేక పూజల తేదీలను, ప్రాంతాలను సామా రామ్మోహన్ రెడ్డి మీడియా ముందు పెట్టారు. మార్చి 2న తమిళనాడులోని తిరుచిరాపల్లిలో, మే 31 నుంచి జూన్ 1 వరకు కర్ణాటకలోని శివమొగ్గలో హరీష్ రావు క్షుద్రపూజలు నిర్వహించారని తెలిపారు. అలాగే జూన్ 20న తిరుచ్చిలో జయగోరి కాళీ పూజలు, జూలై 23న తిరిగి శివమొగ్గలో క్షుద్రపూజలు చేశారని ఆరోపించారు. తాంత్రిక పూజలు చేయాల్సిన అవసరం హరీష్ రావుకు ఏమొచ్చిందో, ఎందుకు, ఎవరికి కీడు చేయాలని ఇవి చేస్తున్నారో ప్రజలకు స్పష్టం చేయాలని, ఆయనతో పాటు కవిత కూడా దీనిపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

**రెచ్చగొట్టి ప్రాణాలు తీయించిన చరిత్ర మీది..**

తాము అధికారంలో ఉంటేనే రాష్ట్రం ఉండాలని, లేకపోతే నాశనం కావాలనే వికృత మనస్తత్వంతో ప్రతిపక్ష నాయకులు ప్రవర్తిస్తున్నారని రామ్మోహన్ రెడ్డి మండిపడ్డారు. రైతులు ఏడవాలని, ప్రభుత్వంపై పుల్లలు పెట్టాలనే దురుద్దేశంతో హరీష్ రావు కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. ప్రజలను, రైతులను, మహిళలను, పిల్లలను రెచ్చగొట్టి రాజకీయ ప్రయోజనాలు పొందాలని చూస్తున్నారన్నారు. గతంలో ప్రజలను రెచ్చగొట్టి ప్రాణాలు తీయించిన చరిత్ర ఉన్న ప్రతిపక్ష నేతల మాటలను ఎవరూ నమ్మవద్దని, ఇలాంటి దుర్మార్గులను సమాజం నుంచి బహిష్కరించాలని పిలుపునిచ్చారు.సాధారణంగా రాష్ట్రంలో పంటలు బాగా పండాలని, వర్షాలు సమృద్ధిగా కురవాలని నేతలు పూజలు చేస్తారని, కానీ బీఆర్ఎస్ నేత ప్రకాష్ వర్షాలు పడొద్దని స్వయంగా మీడియాలోనే మొక్కుకున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపిస్తున్న సీఎం రేవంత్ రెడ్డిని ఇలాంటి తాంత్రిక పూజలు ఏమీ చేయలేవని ధీమా వ్యక్తం చేశారు. దేవుడు ఎప్పుడూ మంచి చేసేవాళ్ల వైపే ఉంటాడని, రాష్ట్రంలోని రైతులు, మహిళలు, యువత కాంగ్రెస్ వైపే ఉన్నారని, అందుకే దేవుడి దయతో రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా పడుతున్నాయని రామ్మోహన్ రెడ్డి పేర్కొన్నారు.

# బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధం

## పెద్ది మరణం చుట్టూ తెలంగాణ రాజకీయం..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సీనియర్ నేత దివంగత పెద్ది సుదర్శన్ రెడ్డి అకాల మరణం తీవ్ర కలకలం రేపుతోంది. గత నెల 26న హనుమకొండలో గుండెపోటుకు గురైన ఆయన, సికింద్రాబాద్ ఆసుపత్రిలో ఐదు రోజుల పాటు చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి కన్నుమూశారు. భారీ ఎత్తున తరలివచ్చిన అభిమానులు, కార్యకర్తల సమక్షంలో అంత్యక్రియలు ముగిసినప్పటికీ, ఆయన హఠాన్మరణం వెనుక ఉన్న కారణాలపై మాత్రం రాజకీయ మంటలు రాజుకున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన రాజకీయ ఒత్తిళ్లే ఆయన అనారోగ్యానికి, మరణానికి కారణమంటూ బీఆర్ఎస్ విమర్శిస్తుంటే... శవ రాజకీయాలు చేయడమే కల్వకుంట్ల కుటుంబ నైజమని కాంగ్రెస్ విరుచుకుపడుతోంది.

**పెద్దిపై ఒత్తిడి: కేటీఆర్**

ఇవాళ తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. పెద్ది సుదర్శన్ రెడ్డిపై కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్రస్థాయిలో రాజకీయ ఒత్తిడి తెచ్చిందని ఆరోపించారు. అక్రమ కేసులు పెట్టి ఇబ్బంది పెడుతున్నారని పెద్ది నా దగ్గరకు వచ్చి చెప్పారు. విద్యాశాఖలో జరిగిన అవినీతిపై ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆయన చనిపోయిన మ-రుసటి రోజే ఆ కేసులో సుప్రీంకోర్టు కాంగ్రెస్ ప్రభుత్వానికి నోటీసులు ఇచ్చిందని కేటీఆర్ వెల్లడించారు. పెద్ది ఆసుపత్రిలో ఉన్న సమయంలో బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సెన్సేషనల్ ఆరోపణలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి సన్నిహితుడి ప్రమేయంతో నర్సంపేటలోని భూముల వ్యవహారంలో కేసులు నమోదు చేసి పెద్ది అనుచరులను వేధించారని, రూ.1,100 కోట్ల సివిల్ సప్లైస్ స్కామ్‌తో పాటు విద్యాశాఖలో బంకర్ బెడ్ల కొనుగోలుపై పెద్ది సుదర్శన్ రెడ్డి సుప్రీంకోర్టు, ఈడీలను ఆశ్రయించి ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకే ఆయనను టార్గెట్ చేశారని ఆరోపించారు. వట్టి నాగుల పల్లి భూములపై కూడా పెద్దిపై రేవంత్ రెడ్డి అనుచరుడు ఒకరు తీవ్రమైన ఒత్తిడి చేసినట్లు ఆరోపించారు.

**అప్పుడు పట్టించుకోకుండా.. ఇప్పుడు 'డ్రామాలు': పొంగులేటి**

పెద్ది సుదర్శన్ రెడ్డి బతికున్నప్పుడు నిర్లక్ష్యం చేసి.. చనిపోయాక రాజకీయాల కోసం వాడుకుంటున్న డ్రామారావు.. పదేండ్లు అధికారంలో ఉన్నా, ఉద్యమ కారుడు, దివంగత పెద్ది సుదర్శన్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వకుండా అవమానించింది బీఆర్ఎస్ పార్టీ అని ధ్వజమెత్తారు. సంతోష్ రావు, దామోదర్ రావు లాంటి వారికి రాజ్యసభ పదవులు ఇచ్చిన బీఆర్ఎస్, పెద్ది సుదర్శన్ రెడ్డి ఎమ్మెల్యేగా ఓడిపోయిన తర్వాత ఆయనకు రాజ్యసభ గానీ, ఎమ్మెల్సీ పదవి గానీ ఎందుకు ఇవ్వలేదు? అని నిలదీశారు. పెద్ది సుదర్శన్ రెడ్డిని వరంగల్ నుంచి హైదరాబాద్‌కు తరలించేందుకు గ్రీన్ ఛానెల్ ఏర్పాటు చేయడమే కాకుండా, అంత్యక్రియలను అధికారిక పోలీసు లాంఛనాలతో నిర్వహించి గౌరవించింది కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు. ఉద్యమకారులను ఓట్ల కోసం, రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం... అధికారం, కీలక పదవులన్నింటినీ కల్వకుంట్ల కుటుంబమే అనుభవించడం...కల్వకుంట్ల కుటుంబానికి వెన్నతో పెట్టిన విద్య అని విమర్శించారు. మరణాలను సైతం రాజకీయ లబ్ధి కోసం ఉపయోగిస్తూ నీచానికి దిగజారిన బీఆర్ఎస్ పార్టీకి వచ్చే ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు మరోసారి గుణపాఠం చెప్పడం ఖాయం అని హెచ్చరించారు.

**పెద్ది సతీమణి వ్యాఖ్యలపై సస్పెన్స్:**

ఇదిలా ఉంటే అంతిమయాత్ర సమయంలో పెద్ది సుదర్శన్ రెడ్డి సతీమణి పెద్ది స్వప్న చేసిన వ్యాఖ్యలు ఈ వ్యవహారంలో మరింత సస్పెన్స్‌ను పెంచాయి. నర్సంపేట అమ-రవీరుల స్థూపం వద్ద భర్త పార్థివదేహం పక్కనే నిలబడి.. "నా భర్తను మీరే పొట్టన పెట్టుకున్నారు" అంటూ చెప్పు చూయిస్తూ చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో తీవ్ర చర్చకు దారి తీసింది. దీంతో ఆమె ఎవరిని ఉద్దేశించి ఆ వ్యాఖ్యలు చేశారనే సస్పెన్స్ కొనసాగుతున్న వేళ పెద్ది మరణంపై కేటీఆర్, మంత్రి పొంగులేటి వ్యాఖ్యలు రాజకీయంగా దుమారం రేపుతున్నాయి.

# బిహార్ రాజకీయాల్లో సంచలనం..



**బిహార్ :** దేశ వ్యాప్తంగా తీవ్ర ఉత్కంఠ రేపిన బిహార్‌లోని బంకీపూర్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో సంచలన ఫలితం నమోదైంది. జన సురాజ్ పార్టీ అధినేత, ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ (పీకే) ఘన విజయం సాధించారు. తొలిసారి ప్రత్యక్ష ఎన్నికల బరిలోకి దిగిన పీకే, సమీప బీజేపీ అభ్యర్థి నీరజ్ కుమార్ సిన్హాపై 18 వేల ఓట్ల మెజార్టీతో విజయం సాధించి చట్టసభలోకి అడుగుపెడుతున్నారు. పాట్నా పరిధిలోని బంకీపూర్ అసెంబ్లీ నియోజకవర్గం గత మూడు దశాబ్దాలుగా (1995 నుంచి) భారతీయ జనతా పార్టీకి తిరుగులేని కంచుకోటగా ఉంది. గతంలో ఇక్కడి నుంచి ప్రాతినిధ్యం వహించిన నితిన్ నబీన్ వరసగా ఐదుసార్లు విజయం సాధించారు. నితిన్ నబీన్ ఇటీవల బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా ఎంపికై, రాజ్యసభకు ఎన్నికవ్వడంతో ఈ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యమైంది. తన సొంత స్థానం కావడంతో పాటు అధికారంలో ఉండటంతో గెలుపు నల్లేరుపై నడకేనని భావించిన బీజేపీకి ప్రశాంత్ కిషోర్ ఊహించని షాక్ ఇచ్చారు.

**మొదటి ప్రయత్నంలోనే గ్రాండ్ ఎంట్రీ..**

గతంలో పలు జాతీయ, ప్రాంతీయ పార్టీలకు ఎన్నికల వ్యూహకర్తగా పనిచేసి అద్భుత విజయాలను అందించిన ప్రశాంత్ కిషోర్, ఆ తర్వాత 'జన సురాజ్' పేరుతో సొంత పార్టీని స్థాపించిన సంగతి తెలిసిందే. ఇటీవల జరిగిన బిహార్ అసెంబ్లీ ఎన్నికల తర్వాత జరిగిన ఈ ఉప ఎన్నికను పీకే ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించి ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయిలో ప్రచారం నిర్వహించారు. ఈ విజయం బిహార్ రాజకీయాల్లో నూతన శకానికి నాంది అని, ప్రజలు మార్పును కోరుకుంటున్నారని ప్రశాంత్ కిషోర్ మద్దతుదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఓట్ల లెక్కింపు పూర్తవ్వడంతో కాసేపట్లో ఎన్నికల కమిషన్ దీనిపై అధికారిక ప్రకటన విడుదల చేయనుంది.

సంపాదకీయం

# రిజర్వేషన్లపై కొత్త చర్చ...

## సమతుల్య పరిష్కారమే మార్గమా?

భారతదేశంలో రిజర్వేషన్ల అంశం కేవలం ఒక ప్రభుత్వ విధానం మాత్రమే కాదు. అది దేశ సామాజిక చరిత్ర, రాజ్యాంగ తత్వం, సమాన అవకాశాలు, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య విలువలతో ముడిపడి ఉన్న అంశం. అందుకే ఈ విషయంపై చర్చలు ఎప్పుడూ రాజకీయాలను దాటి సమాజాన్ని ప్రభావితం చేస్తుంటాయి. ఇటీవల సోషల్ మీడియాలో "రిజర్వేషన్ హఠావో ఆందోళన్" పేరుతో జరుగుతున్న ప్రచారం మరోసారి దేశవ్యాప్తంగా ఈ అంశాన్ని చర్చల కేంద్రంగా నిలిపింది. ఒకవైపు విద్య, ఉద్యోగాల్లో కుల ప్రాతిపదికన కాకుండా ప్రతిభనే ఏకైక ప్రమాణంగా తీసుకోవాలనే వాదనలు వినిపిస్తుండగా, మరోవైపు సామాజిక అసమానతలు ఇంకా పూర్తిగా తొలగిపోని పరిస్థితుల్లో రిజర్వేషన్ వ్యవస్థ అవసరం కొనసాగుతుందని అనేక వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ రెండు అభిప్రాయాల మధ్య సమతుల్య విశ్లేషణ అవసరం. భారత రాజ్యాంగ నిర్మాతలు స్వాతంత్ర్యం అనంతరం దేశ సామాజిక నిర్మాణాన్ని పరిశీలించినప్పుడు, శతాబ్దాలుగా కొనసాగిన కుల వివక్ష, విద్యా వెనుకబాటుతనం, పరిపాలనా వ్యవస్థలో అసమాన ప్రాతినిధ్యం వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక రక్షణ చర్యలను రూపొందించారు. అందులో భాగంగానే రాజ్యాంగంలోని ఆర్టికల్ 15(4), 16(4), 46 వంటి నిబంధనల ద్వారా సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి అవకాశం కల్పించారు. ఈ నేపథ్యంలో రిజర్వేషన్లను కేవలం ఉద్యోగాలు లేదా విద్యాసంస్థల్లో సీట్ల కేటాయింపుగా మాత్రమే కాకుండా, సామాజిక న్యాయం సాధించే ఒక రాజ్యాంగ సాధనంగా చూడాలనే అభిప్రాయం బలంగా ఉంది. అదే సమయంలో, గత ఏడు దశాబ్దాల కాలంలో భారత సమాజంలో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయనే వాదన కూడా వినిపిస్తోంది. విద్యావకాశాలు పెరిగాయి. పట్టణీకరణ విస్తరించింది. కొత్త ఉపాధి రంగాలు ఏర్పడ్డాయి. సమాచార సాంకేతికత, ఆర్థిక అభివృద్ధి అనేక వర్గాలకు కొత్త అవకాశాలను తెరిచాయి. ఈ మారిన పరిస్థితుల్లో రిజర్వేషన్ విధానాన్ని కాలానుగుణంగా సమీక్షించాలా? అనే ప్రశ్న కూడా సహజంగానే ముందుకు వస్తోంది. అయితే సమీక్ష అవసరం ఉందనే అభిప్రాయం, రిజర్వేషన్ వ్యవస్థను పూర్తిగా రద్దు చేయాలనే అభిప్రాయంతో సమానం కాదనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. రిజర్వేషన్లపై జరుగుతున్న ప్రతి చర్చలో "మెరిట్" అనే అంశం ప్రధానంగా ప్రస్తావనకు వస్తుంది. ప్రతిభ ఆధారంగానే అవకాశాలు కల్పించాలని ఒక వర్గం వాదిస్తోంది. ఇది సూత్రప్రాయంగా సమానత్వ భావనకు దగ్గరగా కనిపిస్తుంది. అయితే ప్రతిభ అనేది వ్యక్తిగత సామర్థ్యంతో పాటు, విద్యా వాతావరణం, కుటుంబ ఆర్థిక పరిస్థితి, సామాజిక మద్దతు, నాణ్యమైన విద్యకు అందుబాటు వంటి అనేక అంశాల సమ్మేళనమనే అభిప్రాయం కూడా ఉంది. ఒకవైపు అత్యుత్తమ విద్యా సదుపాయాలు, సాంకేతిక వనరులు, ప్రోత్సాహక వాతావరణం కలిగిన విద్యార్థి, మరోవైపు మౌలిక సదుపాయాల కొరతతో కూడిన పరిస్థితుల్లో చదువుతున్న విద్యార్థిని ఒకే కొలమానంతో అంచనా వేయడం ఎంతవరకు న్యాయమనే ప్రశ్నకు సులభమైన సమాధానం లేదు. ఇంకోవైపు, రిజర్వేషన్ల అమలుపై కూడా అనేక ప్రశ్నలు ఎప్పటికప్పుడు వినిపిస్తూనే ఉన్నాయి. నిజంగా అత్యంత వెనుకబడిన వారికి ప్రయోజనం చేరుతోందా? రిజర్వేషన్ ప్రయోజనాలు కొద్దిమంది కుటుంబాలకే పరిమితమవుతున్నాయా? సామాజికంగా, ఆర్థికంగా కొత్త వాస్తవాలను దృష్టిలో ఉంచుకుని వర్గీకరణను పునఃసమీక్షించాలా? వంటి అంశాలపై నిపుణులు, రాజకీయ పార్టీలు, సామాజిక సంస్థలు వేర్వేరు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నాయి. ఈ ప్రశ్నలు రిజర్వేషన్ విధానాన్ని వ్యతిరేకించడం కంటే, దాని సమర్థతను మెరుగుపరచే దిశగా కూడా చూడవచ్చు. దేశంలో కుల వివక్ష పూర్తిగా అంతరించిపోయిందా అనే ప్రశ్నకు కూడా ఏకాభిప్రాయం లేదు. ఒకవైపు విద్య, ఉపాధి, రాజకీయ ప్రాతినిధ్యంలో వెనుకబడిన వర్గాల భాగస్వామ్యం గతంతో పోలిస్తే పెరిగిందని గణాంకాలు సూచిస్తున్నాయి. మరోవైపు, కొన్ని ప్రాంతాల్లో అంటరానితనం, కుల ఆధారిత హింస, కులాంతర వివాహాలపై దాడులు, భూ వివాదాలు వంటి సంఘటనలు ఇంకా నమోదవుతూనే ఉన్నాయి. అంటే సామాజిక మార్పు చోటుచేసుకున్నప్పటికీ, అది అన్ని ప్రాంతాల్లో ఒకే స్థాయిలో జరగలేదని కూడా అర్థమవుతోంది. అందువల్ల సామాజిక న్యాయం సాధించామా లేదా అన్నది కేవలం భావోద్వేగాల ఆధారంగా కాకుండా, సమగ్ర అధ్యయనాల ఆధారంగా అంచనా వేయాల్సిన అవసరం ఉంది. రిజర్వేషన్లపై జరుగుతున్న చర్చలో మరో ముఖ్యమైన అంశం ఆర్థిక వెనుకబాటుతనం. నేటి పరిస్థితుల్లో పేదరికం అన్ని వర్గాల్లోనూ ఉందని, కాబట్టి ఆర్థిక స్థితినే ప్రధాన ప్రమాణంగా పరిగణించాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అదే సమయంలో, సామాజిక వివక్ష మరియు ఆర్థిక పేదరికం రెండూ ఒకే సమస్య కాదని రాజ్యాంగ నిపుణులు గుర్తుచేస్తున్నారు. సామాజిక వెనుకబాటుతనం, చారిత్రక వివక్ష, ప్రాతినిధ్య లోపం వంటి అంశాలు కేవలం ఆదాయంతో మాత్రమే కొలవలేమని వారు పేర్కొంటున్నారు. అందువల్ల ఆర్థిక సంక్షేమ విధానాలు, సామాజిక న్యాయ విధానాలు పరస్పరం పూరకంగా ఉండాలనే అభిప్రాయం కూడా ఉంది. ఈ మొత్తం చర్చలో అత్యంత కీలకమైన అంశం విశ్వసనీయ గణాంకాల లభ్యత. దేశంలో వివిధ సామాజిక వర్గాల విద్యా స్థాయి, ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రాతినిధ్యం, ఉన్నత విద్యలో ప్రవేశాలు, ఆర్థిక పరిస్థితి వంటి అంశాలపై సమగ్ర సమాచారం ఆధారంగా విధాన నిర్ణయాలు తీసుకోవాలనే డిమాండ్ పెరుగుతోంది. సమగ్ర కుల గణన, శాస్త్రీయ డేటా, స్వతంత్ర అధ్యయనాలు వంటి అంశాలు విధాన నిర్ణయాలను మరింత పారదర్శకంగా, విశ్వసనీయంగా మార్చగలవని అనేక నిపుణులు సూచిస్తున్నారు. గణాంకాల ఆధారంగా జరిగే చర్చ భావోద్వేగాల కంటే వాస్తవాలకు దగ్గరగా ఉంటుంది. సోషల్ మీడియా విస్తరణతో ప్రజా చర్చల స్వరూపం కూడా మారింది. వైరల్ పోస్టులు, వీడియోలు, హ్యాష్‌ట్యాగ్‌లు తక్కువ సమయంలో లక్షల మందికి చేరుతున్నాయి. దీంతో ప్రజాభిప్రాయంపై వాటి ప్రభావం పెరిగింది. అయితే సోషల్ మీడియా ప్రచారం ప్రజాస్వామ్య చర్చకు వేదిక కావచ్చు కానీ, ప్రజా విధానాలకు ప్రత్యామ్నాయం కాదు. రాజ్యాంగబద్ధమైన సంస్థలు, శాసనసభలు, న్యాయస్థానాలు, నిపుణుల కమిటీలు, ప్రజల అభిప్రాయాల సమన్వయంతోనే దీర్ఘకాలిక విధానాలు రూపొందుతాయి. అందువల్ల ఇలాంటి సున్నితమైన అంశాలపై చర్చ వాస్తవాలు, గణాంకాలు, రాజ్యాంగ స్ఫూర్తి ఆధారంగానే సాగాలి. రిజర్వేషన్ వ్యవస్థలో సంస్కరణలు అవసరమా అనే ప్రశ్నకు సమాధానం కూడా చర్చ ద్వారానే రావాలి. విధాన అమలులో పారదర్శకత, నిజమైన లబ్ధిదారులకు ప్రయోజనం చేరడం, ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయడం, నైపుణ్యాభివృద్ధికి మరింత ప్రాధాన్యం ఇవ్వడం, పేద కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించడం వంటి అంశాలు సమాంతరంగా ముందుకు సాగాలి. అదే సమయంలో సామాజిక అసమానతలు ఇంకా కొనసాగుతున్నాయా? వాటి తీవ్రత ఎంత? అనే అంశాలపై నిరంతర సమీక్ష కూడా అవసరం. రిజర్వేషన్లపై అభిప్రాయ భేదాలు ప్రజాస్వామ్యంలో సహజం. అయితే ఈ చర్చ రాజకీయ నినాదాలు లేదా సోషల్ మీడియా ప్రచారాలకే పరిమితం కాకుండా, రాజ్యాంగ విలువలు, సామాజిక వాస్తవాలు, శాస్త్రీయ గణాంకాలు, సమాన అవకాశాల లక్ష్యాలను దృష్టిలో ఉంచుకుని ముందుకు సాగితేనే దేశ ప్రయోజనాలకు అనుకూలమైన నిర్ణయాలు వెలువడతాయి. అంతిమంగా గెలవాల్సింది ఏ ఒక్క వాదన కాదు; భారత రాజ్యాంగం ప్రతిపాదించిన సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, ప్రజాస్వామ్య స్ఫూర్తి అనే మూల విలువలే. అదే దేశ అభివృద్ధికి, సామాజిక సామరస్యానికి, ప్రజాస్వామ్య బలపాటుకు బలమైన పునాది అవుతుంది.

# బాదుడు తప్పదా..?

బ్యాంకులో అయితే సొమ్ము భద్రంగానే ఉంటుందనే నమ్మకంతో ఖాతాదారులు బిందాస్‌గా ఉంటారు. కానీ వారికి తెలియకుండానే.. ఏదో ఛార్జీల పేరుతో ఖాతాల్లో నగదు మెల్లగా ఖాళీ అవుతోందనే సంగతి కేంద్రం పార్లమెంట్ సాక్షిగా బయటపెట్టింది. ఏకంగా వేల కోట్ల రూపాయల మేర బ్యాంకులు చేస్తున్న దోపిడీ చూసి.. కష్టమర్లకు కళ్లు తిరుగుతున్నాయి. మినిమం బ్యాలెన్స్, ఏటీఎం లావాదేవీల పరిమితి.. ఎస్ఎంఎస్ లిమిట్.. ఇలా పేరేదైతేనేం.. కష్టమర్ల ఖాతాలు ఖాళీ చేయటానికి బ్యాంకులు ఒకదానితో మరొకటి పోటీ పడుతున్నాయి. మినిమం బ్యాలెన్స్ పేరుతో బ్యాంకులు వసూలు చేసిన మొత్తం పాతిక వేల కోట్ల రూపాయల పైమాటే. ఈ విషయంలో ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకులు రెండూ పోటాపోటీగానే ఉన్నాయి. అదేమంటే ఖాతాలు నిర్వహించినందుకు.. ఏదో రూపంలో ముట్టజెప్పకపోతే ఎలాగనే వాదన ఉండనే ఉంది. నాలుగేళ్లలో అక్షరాలా రూ. 26 వేల కోట్లు. ఒక్క ఏడాదిలోనే రూ. 7 వేల కోట్లు. ఇదేదో ఆషామాషీ కలెక్షన్ లెక్క మాత్రం కాదు. దేశంలో ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకులు కలిసి.. కూడబలుక్కుని ఖాతాదారుల నుంచి వసూలు చేసిన భారీమొత్తాలు. ఇవేవో అల్లాటప్పా వ్యక్తి చెప్పిన లెక్కలు కూడా కాదు. ఏకంగా పార్లమెంట్‌లో కేంద్రమంత్రే స్వయంగా బ్యాంకుల బాదుడు గురించి చెప్పి.. మొత్తంగా దేశం కళ్లు తెరిపించారు. దీంతో మొన్నటిదాకా బ్యాంకులు అదనపు ఛార్జీలు వసూలు చేసినా.. అవేముంది.. చిన్న మొత్తమే కదా అని సరిపెట్టుకున్న ఖాతాదారులకు ఈ గణాంకాలు చూసి కళ్లు తిరిగినంత పనౌతోంది. ఈ లెక్కన బ్యాంకు ఖాతాల్లో ఉన్న సొమ్ము పెరగటం సంగతి అటుంచి.. తరిగిపోవడం మాత్రం ఖాయమేనని తేలిపోతోంది. ఓవైపు వడ్డీరేట్లు తగ్గి.. జనం బ్యాంకుల్లో డిపాజిట్లు తగ్గిస్తోంటే.. అయినా సరే బ్యాంకులు మాత్రం ఉన్న ఖాతాదారుల నుంచి ఛార్జీల వసూలు చేయడంలో మాత్రం తగ్గేదే లేదని తేల్చేస్తున్నాయి. ఎప్పటికప్పుడు ఆర్బీఐ ఖాతాదారులకు ఛార్జీలు విధించడం కంటే అవగాహన పెంచటానికే ప్రాధాన్యమివ్వాలని బ్యాంకులకు సూచిస్తోంది. కానీ ఆర్బీఐ మాటలు ఏ బ్యాంకూ పట్టించుకోవడం లేదన్న విషయం పార్లమెంట్ సాక్షిగా బట్టబయలైంది. మరి దేశంలో బ్యాంకింగ్ సిస్టమ్‌ను బలోపేతం చేసే విధానం ఇదేనా అనే ప్రశ్నకు ఎవరు సమాధానం చెబుతారో బ్యాంకులకే తెలియాలి. బ్యాంకు ఖాతాల్లో కనీస బ్యాలెన్స్ ఉంచకపోవడం వల్ల కష్టమర్ల నుంచి భారీ మొత్తంలో ఛార్జీలు వసూలయ్యాయి. కనీస సగటు బ్యాలెన్స్ నిర్వహించని సేవింగ్స్, కరెంట్ ఖాతాలపై బ్యాంకులు విధించిన ఛార్జీల వివరాలను ప్రభుత్వం పార్లమెంట్‌కు వెల్లడించింది. రాజ్యసభలో ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి ఈ వివరాలు తెలిపారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డేటాను ప్రస్తావిస్తూ ఆయన ఈ సమాచారాన్ని వెల్లడించారు. కేవలం 2025-26 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకులు ఖాతాదారుల నుంచి రూ. 7,000 కోట్లకు పైగా వసూలు చేశాయి. ఇందులో ప్రైవేట్ బ్యాంకులు దాదాపు రూ. 5,000 కోట్లు వసూలు చేయగా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ అత్యధికంగా రూ. 1,798.14 కోట్లు వసూలు చేసింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ప్రైవేట్ రంగ బ్యాంకులు కనీస బ్యాలెన్స్ ఉంచని ఖాతాలపై రూ. 4,948.71 కోట్లను ఛార్జీల రూపంలో వసూలు చేశాయి. అదే సమయంలో ప్రభుత్వ రంగ బ్యాంకులు రూ. 2,137.92 కోట్లు వసూలు చేశాయి. ప్రైవేట్ బ్యాంకుల్లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ అత్యధికంగా రూ. 1,798.14 కోట్లు వసూలు చేయగా, యాక్సిస్ బ్యాంక్ రూ. 1,081.33 కోట్లతో తర్వాతి స్థానంలో ఉంది. ఈ రెండు బ్యాంకులు కలిపి రూ. 2,879.47 కోట్లను వసూలు చేశాయి. ఇది 19 ప్రైవేట్ రంగ బ్యాంకులు వసూలు చేసిన మొత్తం ఛార్జీల్లో 58 శాతం. గత నాలుగు ఆర్థిక సంవత్సరాల్లో కనీస సగటు బ్యాలెన్స్ నిర్వహించని కారణంగా బ్యాంకులు వసూలు చేసిన ఛార్జీలు చూస్తే ప్రభుత్వ రంగ బ్యాంకులు మొత్తం రూ. 10,230.75 కోట్లు వసూలు చేశాయి. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ. 2,407.82 కోట్లు, 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ. 2,909.10 కోట్లు, 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ. 2,775.91 కోట్లు, 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ. 2,137.92 కోట్లు వసూలు చేశాయి. ఇక ప్రైవేట్ రంగ బ్యాంకులు నాలుగేళ్లలో రూ. 15,939.62 కోట్లు వసూలు చేశాయి. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ. 3,173.96 కోట్లు, 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ. 3,623.77 కోట్లు, 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ. 4,431.97 కోట్లు, 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ. 4,709.92 కోట్లు వసూలు చేశాయి. గత నాలుగు సంవత్సరాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకులు కలిపి కనీస బ్యాలెన్స్ నిర్వహించని ఖాతాలపై మొత్తం రూ. 26,170.37 కోట్లను ఛార్జీల రూపంలో వసూలు చేశాయి. ఈ మొత్తం వసూళ్లలో ప్రైవేట్ రంగ బ్యాంకుల వాటా సుమారు 61 శాతం కాగా, ప్రభుత్వ రంగ బ్యాంకుల వాటా 39 శాతంగా ఉంది. బేసిక్ సేవింగ్స్ బ్యాంక్ డిపాజిట్ అకౌంట్లు, ప్రధాన మంత్రి జన్ ధన్ యోజన ఖాతాలకు ఇలాంటి జరిమానా ఛార్జీలు వర్తించవని కేంద్ర మంత్రి పంకజ్ చౌదరి స్పష్టం చేశారు. అయితే ఈ ఖాతాల లావాదేవీలపై బ్యాంకులు కఠిన ఆంక్షలు విధించడంతో.. వీటితో ప్రయోజనం లేదని సామాన్యులు భావిస్తున్నారు. దీంతో విధిలేక అందరూ ఛార్జీలు పడతాయని తెలిసినా.. మినిమం బ్యాలెన్స్ రూల్ ఉండే ఖాతాలకే మొగ్గుచూపుతున్నారు. ఏతావాతా బ్యాంకులు తెలివిగా కష్టమర్లను అట్నుంచి ఇటు మళ్లిస్తున్నాయనడంలో సందేహం లేదు. సర్కారు నిలదీస్తే.. మినిమం బ్యాలెన్స్ రూల్ లేని ఖాతాలు కూడా ఉన్నాయని బుకాయిస్తూ.. వాస్తవంలో అలాంటి ఖాతాల్ని నిష్ప్రయోజనమైనవిగా చిత్రీకరిస్తూ.. బ్యాంకులు ఖాతాదారులతో డబుల్ గేమ్ ఆడుతున్నాయి. ఈ విషయం గురించి ప్రభుత్వానికి చూచాయగా తెలిసినా.. ఏమీ తెలియనట్టే ఉంటోందనే ఆరోపణలూ లేకపోలేదు. మొత్తం మీద ఎటుపోయి ఎటొచ్చినా.. మినిమం బ్యాలెన్స్ రూల్ ఉండే ఖాతాలే కష్టమర్లు తీసుకునేలా బ్యాంకులు అన్ని జాగ్రత్తలూ తీసుకుంటాయి. అవసరమైతే ఆ రూల్ లేని ఖాతాలపై మరిన్ని కఠిన ఆంక్షలకూ వెనుకాడవు. అదేమంటే ఆ మాత్రం కనీస ఛార్జీలు కూడా లేకుండా తమకేం ఫాయిదా ఉంటుందని దబాయిస్తాయి. ప్రభుత్వం పైకి ఎన్ని కబుర్లు చెప్పినా.. అంతిమంగా బ్యాంకుల ఆర్థిక స్థితి చూస్తుందని, ఏమాత్రం తేడా వచ్చినా.. తమ మెడపై ప్రైవేటీకరణ, విలీనం కత్తి వేలాడుతుందని ప్రభుత్వ రంగ బ్యాంకులు సాకులు చెబుతున్నాయి. ఇక ప్రైవేట్ బ్యాంకుల్ని ఆ మాత్రం అడగటానికి కూడా దిక్కు లేదు. అసలే అవి ప్రైవేట్ బ్యాంకులు. మా రూల్స్ మా ఇష్టం అంటాయి. ఇష్టం లేకపోతే ఖాతాలు మూసేసుకోమని ఉచిత సలహా ఇచ్చినా ఆశ్చర్యపోనక్కర్లేదు. పైగా ప్రభుత్వ రంగ బ్యాంకులే తెగబడి వేల కోట్ల రూపాయలు వసూలు చేస్తున్నప్పుడు.. ప్రైవేట్ బ్యాంకులు చేస్తే తప్పేంటనే లాజిక్‌లకు కొదవే ఉండదు. నిజానికి గతంలో మాదిరిగా బ్యాంకులకు ఖాతాల నిర్వహణ విషయంలో రిస్క్ లేదు. భౌతిక రికార్డులు పోయి.. అంతా డిజిటలైజేషన్ ప్రక్రియ వచ్చింది. అన్ని ఖాతాలూ సెంట్రల్ సర్వర్‌కు అనుసంధానమై ఉంటాయి. జస్ట్ ఖాతా నంబర్ కొడితే చాలు.. మొత్తం చరిత్ర అంతా కంప్యూటర్ స్క్రీన్‌పై కనిపిస్తుంది. అలాగే సరికొత్త బ్యాంకింగ్ సాఫ్ట్‌వేర్లు వచ్చాయి. వీటి సహాయంతో బ్యాలెన్స్ షీట్లు, రోజువారీ లావాదేవీల నమోదు కూడా చాలా తేలికగా మారిపోయింది. అయినా సరే బ్యాంకులు మాత్రం ఉద్దేశపూర్వకంగా పాత పని విధానాన్ని ప్రస్తావిస్తూ.. జబర్దస్తీగా ఛార్జీలు గుంజుతున్నాయని బ్యాంక్ వినియోగదారుల సంఘాలు మొత్తుకున్నా.. వినిపించుకునే నాథుడే కరువయ్యాడు. అప్పటికీ ఆశ చావక అంబుడ్స్‌మన్ దగ్గరకు వెళ్లిన ఖాతాదారులకు.. బ్యాంకులు వినిపించే వాదన చూసి.. కళ్లు తిరిగినంత పనౌతోంది. ఏదేమైనా బ్యాంకులు ఛార్జీల విషయంలో నో కాంప్రమైజ్ అంటున్నాయనే సంగతి బహిరంగ రహస్యం. అంబుడ్స్‌మన్ ఏం ఖర్మ.. స్వయంగా ఆర్బీఐ.. ఆ మాటకొస్తే కేంద్రం చెప్పినా.. బ్యాంకులు మాత్రం ససేమిరా అంటున్నాయి. ఎక్కువ మాట్లాడితే.. మీరు చెప్పినట్టుగా బ్యాంక్ నడవదు. లాభం కావాలంటే.. ఇలాంటి చిలక్కొట్టుళ్లు తప్పవని సెలవిస్తున్నాయి. దీంతో చేసేదేం లేక.. అటు ఆర్బీఐ.. ఇటు సర్కారు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నాయి. అప్పటికీ ప్రభుత్వ బలవంతం మీద బ్యాంకులు కొన్నాళ్లు మినిమం బ్యాలెన్స్ రూల్ ఎత్తేశాయి. ఇప్పటికీ కొన్ని బ్యాంకులు అలాగే ఉన్నాయి. కానీ మెజార్టీ బ్యాంకులు మాత్రం ఖాతాదారుల ముక్కు పిండి ఛార్జీలు దండుకోవటానికి అలవాటుపడ్డాయి. పైగా ఖాతాదారులకు నొప్పి తెలియకుండా.. ఛార్జీలు వసూలు చేసే ఈ పద్ధతిలో కావాల్సినంత కిక్ ఉందనే ధోరణితో ఉంటున్నాయి.

# రైతుల రక్తం పిండుతున్న దళారులు..

రాష్ట్ర వ్యవసాయ మార్కెట్లలో జరిగే అక్రమాలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం తనిఖీ బృందాలను సిద్ధం చేయగా, వాటిని అడ్డుకునేందుకు వ్యాపారులు, దళారులు ఎత్తుగడలు వేస్తున్నారు. మార్కెట్ల పరిధిలో ఉండే ప్రజాప్రతినిధుల ద్వారా ఒత్తిడి తీసుకొచ్చి నామమాత్రపు తనిఖీలు చేసేందుకు కుట్రలు చేసన్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో రోజుకు కోట్ల లావాదేవీలు నడిచే బోయిన్‌పల్లి, గుడిమల్కాపూర్, గడ్డి అన్నారం, వరంగల్ ఎనుమాములు, మాదన్నపేట, దేవరకొండ, మహబూబ్ నగర్, నల్లగొండ, కరీంనగర్‌మార్కెట్లలో పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నట్లు ఆ శాఖకు ఫిర్యాదులు వచ్చాయి. వాటిని అరికట్టేందుకు ప్రభుత్వం పలుమార్లు కసరత్తు చేసి తనిఖీలు చేపట్టేందుకు 6 బృందాలను ఏర్పాటు చేసింది. ముందుగా అవినీతి, దళారుల పెత్తనం, రైతులను దోపిడీ చేసే మార్కెట్లలో బృందాలు మెరుపు దాడులు చేయనున్నట్లు తెలిసింది. వానలు తగ్గిన తరువాత ఎక్కువ ఫిర్యాదులు వచ్చిన వాటిపై దాడులు చేసేందుకు ప్లాన్ చేసినట్లు సమాచారం. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కొలువుదీరిన తరువాత మంత్రి తుమ్మల ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఉన్న 192 మార్కెట్లకు పాలక వర్గాలను నియమించింది. గత ప్రభుత్వం అవసరం ఉన్న చోట కమిటీలు వేయడం తప్ప మార్కెట్ల గురించి పట్టించుకోలేదు. మంత్రి తుమ్మల ఆ శాఖ బాధ్యతలు చేపట్టిన తరువాతే గతంలో ఎనుమాములు మార్కెట్లలో గోల్‌మాల్ జరిగితే ప్రత్యేక విచారణ చేపట్టి బాధ్యులైన అధికారులపై వేటు వేశారు. ఇంకా పెద్ద ఎత్తున అవినీతి జరుగుతోందనే ఆరోపణలతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మార్కెట్లలో దళారుల వ్యవస్థ, సిండికేట్‌గా మారి రైతులను దోచుకునే వ్యవస్థకు ముక్కుతాడు వేసేందుకు నడుం బిగించింది. ఒక వేళ ప్రభుత్వం తనిఖీలు చేస్తే గత కొన్నేళ్ల నుంచి దుకాణాల అద్దె ఎగ్గొట్టడం, మార్కెట్ ఫీజులు చెల్లించకుండా తప్పుడు లెక్కలు చూపడం, షాపుల్లో పనిచేసే సిబ్బందికి వేతనాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేయడం వంటి అరాచకాలు బయటపడక తప్పదు. ఈ నేపథ్యంలో వ్యాపారులు రూ.కోట్లు ఖర్చు చేసి అధికార పార్టీ నాయకులను మచ్చిక చేసుకుని తనిఖీల నుంచి తప్పించుకునేందుకు పడరాని తిప్పలు పడుతున్నారు.

### దళారుల అంతులేని దోపిడీ..

రాష్ట్రంలో పలు వ్యవసాయ మార్కెట్లలో దళారుల దందా విపరీతంగా పెరిగిపోవడంతో రైతుకు గిట్టుబాటు ధర దక్కడం లేదు. వినియోగదారుడికి సైతం తక్కువ ధరకు కూరగాయలు అందడం లేదు. దళారులు రైతుల శ్రమను దోచుకుంటూ మార్కెట్ ధరలను శాసిస్తున్నారు. బోయినపల్లి, గుడిమల్కాపూర్, గడ్డి అన్నారం, వరంగల్ ఎనుమాముల వంటి పెద్ద మార్కెట్లలో ఈ దళారీ వ్యవస్థ ఎక్కువగా నడుస్తోంది. రైతులు మార్కెట్‌కు తెచ్చిన కూరగాయలను దళారులంతా ఒకటై, సిండికేట్‌గా మారి చాలా తక్కువ ధరకు కొనేస్తారు. అసలైన రైతులకు కేటాయించిన స్టాళ్లను దళారులు చేజిక్కించుకుని సామాన్య వినియోగదారులకు అధిక ధరలకు అమ్ముతున్నారు.

బరువు తూకాల్లో మోసాలు చేయడం, హమాలీ, అడత్(కమీషన్) పేరుతో రైతుల సొమ్ములో అదనపు కటింగ్‌లు విధిస్తున్నారు. రైతుల ముసుగులో నేరుగా పొలాల వద్దకే వెళ్లి తక్కువ రేటుకు కూరగాయలు కొని, మార్కెట్లలో తామే రైతులమంటూ నమ్మించి ఎక్కువ లాభాలు గడిస్తున్నారు. దళారుల దందా అరికట్టాల్సిన అధికారులు కూడా లంచాలకు అలవాటు పడి వ్యాపారులకే వంత పాడుతూ రెండు చేతులా సంపాదన పోగేసుకున్నారనే విమర్శలు ఉన్నాయి.

### ప్రత్యేక బృందాలపై రైతు కమిషన్ అసంతృప్తి

ఇటీవల మంత్రి తుమ్మల ఆధ్వర్యంలో మార్కెట్ల తనిఖీల కోసం నియమించిన ప్రత్యేక బృందాలపై రైతు కమిషన్ అసంతృప్తి వ్యక్తం చేస్తోంది. తాము గ్రేటర్‌నగరంలోని పేరుగాంచిన మార్కెట్లలో తనిఖీలు చేసి అవినీతిని తరిమికొట్టాలని సూచనలు చేస్తే కేవలం ఆరు మార్కెట్లలో తనిఖీలు చేపట్టాలని అధికారుల బృందం పేరుతో ఉత్తర్వులు జారీ చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. తాము గతంలో పలు మార్కెట్లు తనిఖీలు చేసి అక్కడ జరుగుతున్న అక్రమాలపై

నివేదిక ఇస్తే దానిలోని వివరాలు ఎక్కడా పొందు పరచలేదని చెబుతున్నది. పలు మార్కెట్లలో ప్రభుత్వం నుంచి వ్యాపారులు దుకాణాలు అద్దెకు తీసుకుని వాటిని ఇతరులకు రెండింతల ధరలకు అద్దెకు ఇస్తున్నారని, అదే విధంగా రైతులు మార్కెట్‌కు వస్తే స్థలం లేకుండా చేసి వారి పంటలు అమ్ముకోకుండా కుట్రలు చేస్తున్నట్లు తెలిపింది. ముందుగా అక్కడ జరిగే చీకటి దందాను అరికట్టడంతో పాటు

నిజమైన వ్యాపారులకే దుకాణాలు కేటాయించేలా చూడాలని కోరిన విషయాలను మార్కెటింగ్‌శాఖ ఇచ్చిన ఉత్తర్వుల్లో ఎక్కడా లేవని పేర్కొంది. ఈ తనిఖీలు అక్రమాలను నిరోధించే విధంగా లేవని, ఫిర్యాదుల కోసం చేస్తున్నట్లు ఉందని కమిషన్ సభ్యులు వెల్లడించారు.

# సకలకళావల్లభుడు ఉదయ'కృష్ణుడు'!

## వెలుగులోకి మరో మహిళతో 'లివ్-ఇన్' బంధం

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తోటి మహిళా ట్రైనీ ఐపీఎస్‌పై లైంగిక వేధింపులు, దాడికి పాల్పడ్డ కేసులో అరెస్ట్ అయి రిమాండ్‌లో ఉన్న ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి ఉదంతంలో రోజుకో సంచలన విషయం వెలుగులోకి వస్తోంది. నిందితుడి మానసిక వైఖరి, ప్రవర్తనపై లోతుగా దర్యాప్తు చేస్తున్న కొద్దీ విస్తుపోయే నిజాలు బయటపడుతున్నాయి. ఈ కేసు విచారణలో భాగంగా నగర మహిళా భద్రతా విభాగం డీసీపీ లావణ్యానాయక్ జాదవ్ నేతృత్వంలోని పోలీస్ బృందం తాజాగా కీలక రికవరీలు సాధించింది.

గదిలో సోదాలు.. ప్రేమలేఖలు, కత్తి లభ్యం దర్యాప్తులో భాగమైన సీన్ రీ-కన్‌స్ట్రక్షన్ కోసం పోలీసులు అశోక్‌నగర్ లోని ఉదయ్ కృష్ణారెడ్డి నివాసముంటున్న గదిని సోదా చేశారు. ఈ తనిఖీల్లో ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్‌లతో పాటు భద్రపరిచిన రెండు లవ్ లెటర్లు, ఓ కత్తిని స్వాధీనం చేసుకున్నారు. ప్రేమలేఖల్లోని పేర్ల ఆధారంగా ఆరా తీయగా, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మరో మహిళతో ఉదయ్‌కి ఉన్న తీవ్ర సాన్నిహిత్యం బయటపడింది. పోలీసుల కథనం మేరకు సదరు ఆంధ్రా మహిళకు 2014లోనే వివాహమైంది. భర్తకు దూరంగా ఉంటూ బాబుతో జీవిస్తున్న క్రమంలో ఉదయ్ కృష్ణారెడ్డితో పరిచయం ఏర్పడింది. ఆయన సూచన మేరకే హైదరాబాద్‌కు వచ్చి ప్రైవేటు ఉద్యోగం వదిలి, అశోక్‌నగర్‌లోని ఓ ప్రముఖ ఐఏఎస్ కోచింగ్ సెంటర్‌లో చేరారు. అయితే, ఆమెతో 'లివ్-ఇన్ రిలేషన్‌షిప్'లో ఉందామని ఉదయ్ ప్రతిపాదించగా, న్యాయబద్ధంగా విడాకులు రానందున ఆమె నిరాకరించినట్లుగా విచారణలో తెలిసింది.

పోలీసుల వద్ద పక్కా ఆధారాలు..

అయితే, ఈ ఏడాది ఫిబ్రవరిలో బాధిత మహిళా ట్రైనీ ఐపీఎస్ నేరుగా అశోక్‌నగర్‌లోని సదరు మహిళను కలిశారు. ఉదయ్ కృష్ణారెడ్డి విపరీతమైన కోపం, దాడులు, మనోవేదనకు గురిచేసే మానసిక ప్రవర్తనను వివరించారు. ఉదయ్ నిజస్వరూపం తెలుసుకున్న ఆ మహిళ అప్పటి నుంచి అతడికి పూర్తిగా దూరంగా ఉంటున్నట్లుగా తెలిసింది. ఇక మహిళా ట్రైనీ ఐపీఎస్ గదిలోకి ఉదయ్ బలవంతంగా చొరబడి ఆమె ఫోన్‌ను లాక్కున్నాడనే ఆరోపణలకు అనుకూలంగా పోలీసులు ఇప్పటికే బలమైన సాక్ష్యాలు సేకరించారు. పోలీసు శిక్షణలో కూడా ఉదయ్ విపరీత ధోరణి వల్ల తోటి అధికారులు ఇబ్బంది పడ్డారని దాదాపు 20 మంది నుంచి సేకరించిన స్టేట్‌మెంట్ల ద్వారా నిజాలు నిరూపితం అయ్యాయి. ఈ కేసులో మరిన్ని ఆధారాలు, వాస్తవాలు రాబట్టేందుకు నిందితుడిని త్వరలోనే ఉదయ్ కృష్ణారెడ్డిని పోలీస్ కస్టడీకి కోరేందుకు అత్తాపూర్ పోలీసులు రెడీ అవుతున్నారు.

# ఓ వైపు కరువు .. మరోవైపు వరద

**భద్రాచలం,ఫ్లాష్ ఇండియా :** ఎల్‌నినో ప్రభావంతో ఓవైపు వర్షాలు కురవక, వేసిన పంటలకు నీరు లేక తీవ్ర కరువు అనుభవిస్తున్న రైతులకు, గోదావరి వరదల రూపంలో మరో ముప్పు వచ్చి పడింది. ఎగువ రాష్ట్రాల్లో కురిసిన వర్షాలకు ప్రాజెక్టులు నిండి దిగువకు వరద నీరు వదలడంతో భద్రాచలం వద్ద గోదావరి 56 అడుగులు దాటి ప్రవహించడంతో భద్రాచలం నియోజకవర్గంలోని దుమ్ముగూడెం, బూర్గంపహాడ్, అశ్వాపురం మండలాలలో సుమారు 2 వేల ఎకరాల పత్తి, వరి పంటలు మునిగాయి. వర్షాలు ఎప్పటికైనా కురుస్తాయని నమ్మకంతో, అప్పులు చేసి వరి, పత్తి నాటితే గోదావరి కారణంగా పూర్తిగా నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని, అదే పొలంలో మళ్లీ పంటలు వేసుకోవాలంటే అప్పులు పుట్టే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓవైపు ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు కురవక.. వేసిన పంటలకు నీరు లేక తీవ్ర కరువు అనుభవిస్తున్న రైతాంగానికి, గోదావరి వరదల రూపంలో మరో ముప్పు వచ్చి పడింది. మన ప్రాంతంలో వర్షాలు కురవక పోయినా.. ఎగువ రాష్ట్రాల్లో కురిసిన వర్షాలకు ప్రాజెక్టులు నిండి దిగువకు వరద నీరు వదలడంతో భద్రాచలం వద్ద గోదావరి 56 అడుగులు దాటి ప్రవహించింది. భద్రాచలం నియోజకవర్గంలోని దుమ్ముగూడెం, బూర్గంపహాడ్, అశ్వాపురం మండలాలలో కాల్వల కింద, బోర్లు ఉన్న రైతులు వరి, పత్తి పంటలు వేశారు. పై మండలాలలో సుమారు 2 వేల ఎకరాల పత్తి, వరి పంటలను గోదావరి ముంచి వేయడంతో రైతులు కన్నీటిపర్యంతం అవుతున్నారు. వర్షాలు ఎప్పటికైనా కురుస్తాయని నమ్మకంతో, అప్పులు చేసి వరి, పత్తి నాటితే గోదావరి కారణంగా పూర్తిగా నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అదే పొలంలో మళ్లీ పంటలు వేసుకోవాలంటే అప్పులు పుట్టే పరిస్థితి లేదు. పంట నష్టం అంచనా వేసి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. ఎల్ నినో ఒక విధంగా రైతులను కాపాడిందనే చెప్పాలి. ఎందుకంటే.. ఇప్పటి వరకు వర్షాలు లేకపోవడంతో 50 శాతానికి పైగా రైతులు ఇంకా పంటలు వేయలేదు. కేవలం బోర్లు, కాల్వలు ఉన్న పొలాల్లోనే పంటలు వేయడంతో, పంట నష్టం తగ్గింది. అధికారులు త్వరగా పంట నష్టం అంచనా వేసి, ఆర్థికంగా ఆదుకుంటే, తాము మళ్లీ పంటలు వేసుకునే అవకాశం ఉందని, లేకపోతే ఈఏడు వ్యవసాయం చేయలేని పరిస్థితి అని రైతులు అంటున్నారు. దుమ్ముగూడెం మండలంలోని తూరుబాక, రేగుబల్లి, సున్నం బట్టి, బూర్గంపహాడ్ మండలంలోని బూర్గంపహాడ్, ఎన్‌పీ రెడ్డిపాలెం, సారపాక, నెల్లిపాక బంజర, అశ్వాపురం మండలంలోని కొన్ని ప్రాంతాలలో పంట నష్టం ఎక్కువ ఏర్పడింది. గోదావరి రహదారులపై ప్రవేశించడంతో కొంతమేర ఛిద్రం అయ్యాయి. అధికారులు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. బూర్గంపహాడ్ వైపు కూడా కరకట్ట నిర్మించాలి. భద్రాచలం వైపు కరకట్ట నిర్మించి, బూర్గంపహాడ్ వైపు నిర్మించకపోవడంతో ప్రతి సంవత్సరం గోదావరి వరద పంటపొలాలను ముంచెత్తి రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని, బూర్గంపహాడ్ వైపు కూడా కరకట్ట నిర్మించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. పోలవరం బ్యాక్ వాటర్ కారణంగా, పంట పొలాలతో పాటు, అనేక గ్రామాలు కూడా ముంపుకు గురవుతున్నాయని, ప్రభుత్వం స్పందించి కరకట్ట నిర్మాణం చేపట్టాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# అహంకారం ఎక్కువైంది తగ్గించుకోండి

## అప్రమత్తంగా ఉండాలన్న మాతాంగి స్వర్ణలత!

**బేగంపేట,ఫ్లాష్ ఇండియా :** సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి బోనాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. రెండో రోజు వేడుకల్లో భాగంగా రంగం, భవిష్యవాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. సరిగ్గా ఉదయం 9.55కు పచ్చికుండపై నిలబడి అమ్మవారు పూనిన మాతంగి స్వర్ణలత భవిష్యవాణిని చెప్పుకొచ్చారు. ఉజ్జయినీ మహంకాళి బోనాల ఉత్సవాలతో సంతృప్తి చెందావా.. అని ప్రధానార్చకులు ఆమెను ప్రశ్నించారు. అందుకు మాతంగి స్వర్ణలత సమాధానం చెప్పకుండా కాసేపు మౌనంగా ఉంది. మీ సమాధానం కోసం కోట్లాది మంది రాష్ట్ర ప్రజలు ఎదురుచూస్తున్నారని అన్నారు. దీంతో మాతంగి స్వర్ణలత 'నేను ఉత్సవాలకు సంతోషంతో రాలేదురా బాలక.. కోపంతో వచ్చాను. మీరు అడిగే ప్రశ్నలకు సమాధానం ఎందుకు చెప్పాలి? ఏటేటా మీరు పూజలు చేస్తున్నా.. అసంతృప్తితోనే సరిపెట్టుకుంటున్నా..! ఏ ప్రమాదాలు వచ్చినా.. నా బిడ్డలను కాపాడుకుంటూ వస్తున్నా. నా విగ్రహ ప్రతిష్ఠ చేస్తానని మాట తీసుకుంటున్నారు.. మీరు మాత్రం నేను చెప్పింది ఆచరించట్లేదు' అని మాతంగి స్వర్ణలత పలికింది. ఈ క్రమంలోనే ప్రధానార్చకులు ఆచరించట్లేదని కాదమ్మ.. వెసులుబాటు ఉండట్లేదని అన్నారు. అందుకు మాతంగి స్వర్ణలత 'విగ్రహ ప్రతిష్ఠకు ఎవరు అడ్డొచ్చినా.. ఊరుకోను!' అని హెచ్చరించింది. అనంతరం వర్షాలు, ఉపద్రవాల గురించి ప్రశ్నించగా.. 'ఈ ఏడాది వర్షాలు కుంభవృష్టిగా కురుస్తాయి.. జనం కొట్టుకుపోతారు, అగ్ని ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ప్రజలంతా జాగ్రత్తగా ఉండాలిరా బాలక' అని చెప్పుకొచ్చింది. జనం వావివరుసలు లేకుండా ప్రవర్తిస్తున్నారని, తల్లిదండ్రులు తమ పిల్లలను ఊరిమీద వదిలేస్తున్నారని మాతంగి స్వర్ణలత పలికింది. 'నా పట్ల అహంకారం ఎక్కువైనా.. ఈ ఏడు ఉత్సవాల విషయంలో నిరుత్సాహపరిచినా, మిమ్మల్ని కాపాడుతూనే ఉంటా' అని కంటతడి పెట్టింది. భక్తులు దోశడంత ఇస్తే గోరంత కూడా నాకు పెట్టడం లేదు, రాబోయే 6 నెలల్లో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ జరక్కపోతే.. భారీగా ప్రాణనష్టం జరుగుతుంది.. నా ఉగ్రరూపం చూస్తారు' అని మాతంగి స్వర్ణలత పలికింది.

**ఈ ఏడాది భారీ వర్షాలు, వరదలు..**

దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠ పునర్నిర్మించాలని గత కొన్నాళ్ల నుంచి అడిగిన మీరు నిర్మించడం లేదు నన్ను ఎందుకు ప్రశ్నిస్తున్నారు? నేను ఎందుకు ప్రతి ప్రశ్నకు సమాధానం చెప్పాలి? నేను మీ మాటలను గౌరవిస్తున్నాను. కానీ మీరు నా మాటను ఆచరిస్తున్నారా? నేను కోరింది మీరు చేస్తున్నారా? అంటూ సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాల జాతర ఉత్సవాల్లో భాగంగా సోమవారం రెండో రోజు రంగం కార్యక్రమంలో భవిష్యవాణి మాతంగి స్వర్ణలత భవిష్యవాణి వినిపించారు. మీ ఆపదల్లో నేను అండగా నిలిచాను. మీకు వచ్చిన కష్టాలను తొలగించాను. నా పిల్లలను ఎప్పుడూ కాపాడుతున్నాను. ఏ ప్రమాదం వచ్చినా వారికి రక్షణగా ఉంటాను. కానీ మీరు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం లేదు. నా విగ్రహ ప్రతిష్ఠ చేస్తామని చెప్పి ఇప్పటికీ చేయలేదు. ఈ సంవత్సరం నేను మీకు హెచ్చరిస్తున్నాను. భారీ వర్షాలు కురుస్తాయి. వరదల కారణంగా అనేక ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంది. ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలి. ప్రాణ నష్టం జరిగే ప్రమాదం కూడా ఉందని భవిష్యవాణి వివరించారు. అగ్ని ప్రమాదాలు కూడా సంభవించే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ ఏడాది ప్రకృతి విపత్తులు తీవ్రంగా ఉండే సూచనలు కనిపిస్తున్నాయి. ప్రజలు నిర్లక్ష్యం చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నా భక్తులను నేను ఎల్లప్పుడూ కాపాడుతాను. అయితే నా మాటలను గౌరవించి, ధర్మాన్ని పాటిస్తూ, భక్తితో నడుచుకోవాలి. అప్పుడు నా అనుగ్రహం మీ అందరిపై ఉంటుంది." భవిష్యవాణిలో మాతాంగి స్వర్ణలత వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హైదరాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ దేవదాయ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

# రీల్స్‌తో ఫేమస్..

### ప్రభుత్వ ఉద్యోగానికే రిజైన్ చేసిన ఖమ్మం టీచర్

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రీల్స్‌తో ఫేమస్ అయిన ఖమ్మం టీచర్ గౌతమి ప్రభుత్వ ఉద్యోగానికి రిజైన్ చేశారు. గతంలో సోషల్ మీడియాలో ఓ ప్రైవేట్ స్కూల్ ప్రమోషన్ చేసి భూక్యా గౌతమి వార్తల్లో నిలిచారు. ప్రభుత్వ స్కూల్ లో టీచర్ గా చేస్తూ ప్రైవేట్ స్కూల్ ప్రమోటో చేయడంతో తీవ్రవిమర్శలు వచ్చాయి. దీంతో డీఈవో ఆమెను సస్పెండ్ చేశారు. ఇక తాజాగా ఆమె సంచలన నిర్ణయం తీసుకున్నారు. తన ఉద్యోగానికి రాజీనామా చేసి సోషల్ మీడియాలో దానికి గల కారణాలు వెల్లడించారు. సస్పెండ్ చేసిన తరవాత తనకు తిరిగి ఆరు నెలల తరవాత పోస్టింగ్ ఇచ్చారని గౌతమి చెప్పారు. కానీ డీఈవో ఇబ్బందులకు గురి చేస్తున్నారని అందుకే ఉద్యోగానికి రాజీనామా చేస్తున్నానని అన్నారు. తాను ఉద్యోగం కోసం చాలా కష్టపడ్డానని, పేద కుటుంబంలో జన్మించానని చెప్పారు. తన భర్త సపోర్ట్ తో ఈ ఉద్యోగం సంపాదించానని అన్నారు. తాను స్కూల్ లో ఎప్పుడూ సమయం వృధా చేయలేదని చెప్పారు. ఎప్పుడూ ఫోన్ లో మాట్లాడలేదని తెలిపారు. కేవలం ఇంట్లో ఉన్న సమయంలోనే రీల్స్ చేశానని ఆవేదన వ్యక్తం చేశారు. స్కూల్ విద్యార్థులకు తనను దూరం చేశారని మండిపడ్డారు. డీఈవోను కలిసేందుకు అనేకసార్లు వెళ్లానని కానీ కలిసేందుకు అవకాశం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్కూల్ పిల్లలు తనకు ఫోన్ చేసి బాధపడ్డారని అన్నారు. డీఈవోను కలిసేందుకు వెళితే ఛీ... దూరం జరుగు అంటూ తనను అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు. తనపై సమాజం నిందనలు వేసిందని, ఇన్ని నిందలు వేసిన తరవాత ఈ వృత్తిలో ఉండలేనని రాజీనామా చేస్తున్నట్టు చెప్పారు.



# నకిలీ బాబా బాగోతం..

### యువతిని పెళ్లి చేసుకుని, గుప్తనిధుల పేరుతో లక్షలు కాజేసిన కేటుగాడు..!

**గుండ్రేడ్డిపల్లి ,ఫ్లాష్ ఇండియా :** మెదక్ జిల్లాలో ఓ నకిలీ బాబా మోసం వెలుగులోకి వచ్చింది. తూప్రాన్ మండలం గుండ్రేడ్డిపల్లి గ్రామంలో ఓ యువతిని మాయమాటలతో నమ్మించి వివాహం చేసుకున్న వ్యక్తి, ఆ తర్వాత గుప్తనిధుల పేరుతో లక్షల రూపాయలు కాజేసిన ఘటన సంచలనం రేపుతోంది. విషయం బయటపడడంతో గ్రామస్తులు అతడిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. పోలీసుల అందించిన వివరాల ప్రకారం.. మస్తాన్ అనే వ్యక్తి తనను తాను బాబాగా పరిచయం చేసుకుంటూ, ఓ యువతిని నమ్మించాడు. "నన్ను పెళ్లి చేసుకుంటే నీ జన్మ సార్థకం అవుతుంది" అంటూ మాయమాటలు చెప్పి ఆమెను, కుటుంబ సభ్యులను నమ్మించి వివాహం చేసుకున్నాడు కేటుగాడు. వివాహం జరిగిన కొన్ని రోజుల తర్వాత ఇంట్లో గుప్తనిధులు ఉన్నాయని నమ్మించి.. తవ్వకాలు చేయాలంటూ బాధిత కుటుంబం నుంచి లక్షల రూపాయలు తీసుకున్నాడు. గుప్తనిధులు బయటపడతాయని చెప్పి పలుమార్లు తవ్వకాలు కూడా నిర్వహించాడు. అయితే ఈ వ్యవహారం గ్రామంలో బయటపడడంతో మస్తాన్ అక్కడి నుంచి పరారయ్యాడు. అయితే కొంతకాలం తర్వాత తిరిగి గ్రామానికి రావడంతో అప్రమత్తమైన గ్రామస్తులు అతడిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని దేహశుద్ధి చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో మస్తాన్‌కు ఇప్పటికే రెండు వివాహాలు జరిగినట్లు గుర్తించారు. అతనిపై కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# 15 ఏళ్ల బాలికపై కీచకుల....

**అస్సాం:** దేశంలో చట్టాలు మారుతున్నాయి, ప్రభుత్వాలూ మారుతున్నాయి.. కానీ మహిళలు, మైనర్ బాలికల భద్రత పరిస్థితి మాత్రం రోజురోజుకూ దిగజారుతూనే ఉంది. ఈ క్రమంలోనే అస్సాం లో ఒళ్లు గగుర్పొడిచే అత్యంత అమానుష ఘటన వెలుగుచూసింది. 15 ఏళ్ల మైనర్ బాలికపై ఆమె ఇంట్లోనే దారుణంగా అత్యాచారం చేసి, అత్యంత కిరాతకంగా హత్య చేశారు. ఘటన జరిగిన తీరు ఎంత భయానకంగా ఉందంటే.. బాధితురాలి మృతదేహాన్ని చూసిన కుటుంబ సభ్యులు కూడా ఆమెను గుర్తుపట్టలేకపోయారు. దగ్గరి బంధువుల ఇంట్లో విందు ముగించుకుని తిరిగొచ్చిన కుటుంబ సభ్యులకు హైలాకండి జిల్లాలోని తమ ఇంట్లోనే బాలిక విగతజీవిగా పడి కనిపించింది. పోలీసు కథనం మేరకు.. దుండగులు బాలికపై విచక్షణారహితంగా దాడి చేసి, ముఖాన్ని తీవ్రంగా చితకబాదారు. అంతేకాకుండా ఆమె ప్రైవేట్ భాగాల్లో ఇనుప రాడ్డు దింపినట్లుగా వెల్లడించారు. హత్యకు ముందు బాలికపై అత్యాచారం జరిగిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తుండగా, లైంగిక దాడి, మృతికి గల కచ్చితమైన కారణాలను నిర్ధారించేందుకు పోలీసులు పోస్ట్‌మార్టం రిపోర్టు కోసం ఎదురుచూస్తున్నారు. కట్లిచెర్రా పోలీస్ స్టేషన్ పరిధిలోని అలోయిచోరా ప్రాంతంలో శనివారం రాత్రి రాత్రి అర్ధరాత్రి దాటాకా ఈ ఘోరం జరిగింది. బాలిక మొదట తన కుటుంబంతో కలిసి విందు కోసం బంధువుల ఇంటికి వెళ్లింది. అయితే, అక్కడే ఒక బంధువుతో చిన్న గొడవ జరగడంతో ఆమె ఒంటరిగా ఇంటికి తిరిగి వచ్చిందని సమాచారం. అనంతరం కుటుంబ సభ్యులు విందు ముగించుకుని ఇంటికి తిరిగొచ్చేసరికి నేలపై రక్తమడుగులో బాలిక మృతదేహం పడి ఉంది. ఆమె ముఖం తీవ్రంగా గాయపడి గుర్తుపట్టలేని స్థితిలో ఉంది.

**నేషనల్ హైవే దిగ్బంధం.. ఐదుగురి విచారణ**

అయితే, ఈ భయానక ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేసిన స్థానికులు, నిందితులను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ నేషనల్ హైవే 6ను దిగ్బంధించి పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామని, విచారణ నిమిత్తం ఐదుగురిని అదుపులోకి తీసుకున్నామని సీనియర్ ఎస్‌ఎస్పీ అమితాబ్ సిన్హా స్పష్టం చేశారు. మైనర్‌పై లైంగిక దాడి ఆరోపణలను వైద్యపరంగా నిర్ధారించాల్సి ఉందన్నారు. ఈ హత్య కేసును సమగ్రంగా దర్యాప్తు చేస్తున్నామని.. ప్రస్తుతం నలుగురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని ఎస్‌ఎస్పీ అమితాబ్ సిన్హా విలేకరులకు తెలిపారు.

# 'జంతర్ మంతర్'కు గుడ్ బై..

**న్యూ ఢిల్లీ :** దేశ రాజధాని న్యూఢిల్లీలో ప్రధాన నిరసన వేదికగా ఉన్న జంతర్ మంతర్ వద్ద ధర్నాల వల్ల స్థానికులకు, రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. జంతర్ మంతర్‌కు బదులుగా మరొక అనువైన ప్రత్యామ్నాయ ప్రదేశాన్ని కేటాయించే అంశంపై కేంద్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు పొందాలని సొలిసిటర్ జనరల్‌ను ఆదేశించింది. ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని జస్టిస్ జాయ్ మాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ పిటిషన్‌పై కేంద్ర ప్రభుత్వం సహా సంబంధిత వర్గాలకు నోటీసులు జారీ చేసింది.

**పిటిషనర్ ప్రధాన వాదనలు..**

సతీష్ చంద్ కౌశిక్ దాఖలు చేసిన ఈ పిటిషన్‌లో ప్రస్తుతం జంతర్ మంతర్ వద్ద నిరసనలకు అవసరమైన మురుగునీటి




పారుదల , ఆహారం తదితర ప్రాథమిక సౌకర్యాలు లేవని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో ధర్నాలు జరగడం వల్ల స్థానిక నివాసితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అత్యవసర వైద్య సేవలు, సరుకుల సరఫరాకు ఆటంకం కలుగుతోందనీ పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. నిరసనల సమయంలో ప్రాంతంలోకి రావడం, వెళ్లడం కష్టంగా మారుతోందని తెలిపారు.

**కోర్టు వ్యాఖ్యలు..**

విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి స్పందిస్తూ, "రాకపోకలు, అత్యవసర వైద్య సేవల సరఫరాకు సంబంధించి పిటిషన్‌లో లేవనెత్తిన అంశాలు ముఖ్యమైనవి. దీనిపై కేంద్ర ప్రభుత్వం నుంచి స్పష్టమైన సూచనలు తీసుకోండి అని సొలిసిటర్ జనరల్‌ను ఆదేశించారు. విచారణ సమయంలో రాజకీయ నాయకులు పిలుపునిచ్చిన ర్యాలీలు, గత సంఘటనలను పిటిషనర్ తరఫు న్యాయవాది ప్రస్తావించగా, రాజకీయ నిరసనలపై స్పందించేందుకు ధర్మాసనం నిరాకరించింది. ఆయా వ్యవహారాలను ఎలా సరిదిద్దాలో శాంతిభద్రతల యంత్రాంగానికి తెలుసని వ్యాఖ్యానించింది. ఈ కేసు విచారణను సుప్రీంకోర్టు వేరుగా విచారించేందుకు జాబితా చేసింది.

# చిట్టీల పేరుతో భారీ మోసం..

**బీరంగూడ,ఫ్లాష్ ఇండియా :** సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం బీరంగూడ రాఘవేంద్ర కాలనీలో భారీ చిట్టీ మోసం వెలుగులోకి వచ్చింది. స్థానిక మహిళలకు అధిక లాభాల ఆశ చూపి కోట్ల రూపాయలు వసూలు చేసిన దంపతులు రాత్రికి రాత్రే పరారవడంతో బాధితులు ఆందోళనకు గురయ్యారు. ఈ ఘటనపై అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు. స్థానికంగా శిరీష, సాంబశివరావు దంపతులు కొన్నేళ్లుగా చిట్టీల వ్యాపారం నిర్వహిస్తున్నారు. అధిక లాభాలు వస్తాయని నమ్మబలికి కాలనీలోని పలువురు మహిళల నుంచి సుమారు రూ.3 కోట్ల వరకు వసూలు చేసినట్లు బాధితులు తెలిపారు. శిరీష 'సాయి గణేష్ టెక్స్ టైల్స్' పేరుతో బట్టల దుకాణాన్ని నిర్వహిస్తూ.. అదే సమయంలో చిట్టీల వ్యాపారం కూడా సాగించినట్లు తెలుస్తోంది. స్థానికుల నమ్మకాన్ని సంపాదించి భారీ మొత్తంలో డబ్బులు సేకరించారు. బాధితుల కథనం ప్రకారం.. దంపతులు కాలనీలో ఉన్న తమ సొంత



ఇంటిని అమ్మేసి, ఆ తర్వాత ఎవరికి సమాచారం ఇవ్వకుండా రాత్రికి రాత్రే పరారయ్యారు. దీంతో మోసపోయామని గ్రహించిన బాధితులు.. తమకు న్యాయం చేయాలని కోరుతూ బాధితులు అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దంపతుల ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపడుతూ.. పూర్తి స్థాయిలో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# ఇచ్చిన హామీలను నిలబెట్టుకోండి...




**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** నల్లగొండ జిల్లా దామరచర్ల మండలంలోని వీర్లపాలెం గ్రామంలో ఉన్న యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ (వైటీపీఎస్) ఎదుట సోమవారం ప్లాంట్ నిర్మాణం కోసం భూములు కోల్పోయిన కుటుంబాలు ఆందోళన చేపట్టాయి. వైటీపీఎస్ పరిధిలోని తాళ్లవీరప్పగూడెం,వీర్లపాలెం, తిమ్మాపురం,నరసాపురం, కల్లేపల్లి గ్రామాలకు చెందిన భూ నిర్వాసితులు ప్లాంట్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ప్లాంట్ నిర్మాణం కోసం భూములు స్వాధీనం చేసుకున్న సమ-యంలో ఇచ్చిన హామీ మేరకు తమకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. భూములు కోల్పోవడంతో జీవనోపాధి దెబ్బతిన్న తమకు ప్రభుత్వం, సంబంధిత అధికారులు న్యాయం చేయాలని కోరారు.



## ఉద్యమకారునికి నివాళు లర్పించిన చీమ శ్రీనివాస్

**వలిగొండ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** ఉద్యమకారుల ఫోరం యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు గంధమల్ల బాలయ్య గుండెపోటుతో సోమవారం తెల్లవారుజామున మరణించగా ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉద్యమకారుల ఫోరం నాయకులు ఆయన పార్థివదేహంపై పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం మండల కేంద్రంలో చిత్రపటానికి నివాళులు అర్పించి అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ చీమ శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన మాట ప్రకారం మేనిఫెస్టోలో పొందుపరచిన హామీలను వెంటనే అమలు చేసి ఉద్యమకారులను ఆదుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి నల్గొండ జిల్లా అధ్యక్షుడు శీలం స్వామి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జోగు అంజన్న, మొగుళ్ళ శ్రీనివాస్, పలుసం రమేష్, ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు మారగోని శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తిని సహదేవ్ గౌడ్, సాయిని యాదగిరి బొడిగెసుదర్శన్, ఐటిపాముల పుష్పమ్మ, మల్లం వెంకటేశం, ఎక్కలదేవి శ్రీనివాస్, కదిరేని స్వామి, కన్నెకంటి శ్రీనివాసచారి, కొత్త రామచందర్, దండ మల్లికార్జున్, కొండూరు సత్తయ్య, పల్లెర్ల రామచంద్రం, దండ మల్లికార్జున్, ఎదురుగట్ల యాదగిరి, సందయ్య, లక్ష్మయ్య, ఎడవల్లి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి అర్జీలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి




**జనగాం,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** జిల్లాలో వివిధ సమస్యలపై ప్రజలు అందజేసిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. సోమవారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్‌షాలోంతో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజావాణిలో ప్రజలు ఇచ్చిన దరఖాస్తులను అధికారులు త్వరగా పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే స్వీకరించిన దరఖాస్తుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యతను ఇవ్వాలన్నారు. అదే విధంగా పెండింగ్ లో గల ఆర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ఈ ప్రజావాణిలో మొత్తం (326) దరఖాస్తులను కలెక్టర్ స్వీకరించారు. ఈరోజు ప్రజావాణికి వచ్చిన కొన్నింటి దరఖాస్తుల వివరాలిలా ఉన్నాయి..దేవరుప్పుల మండలం, దేవరుప్పుల గ్రామానికి చెందిన వి. అనురాధ, ఇందిరమ్మ ఇళ్లు పథకం కింద ఆర్థిక సహాయం మంజూరు చేయగలరని విజ్ఞప్తి చేస్తూ అర్జీని సమర్పించారు. చిల్పూర్ మండలం, నష్కల్ గ్రామానికి చెందిన ఎస్. అరుణ, తను నిరుపేదరాలని, ఆర్థికంగా వెనుకబడి ఉందని, కిరాయికి ఉండి బతుకుతున్నారని, తమ పాత ఇల్లు చాలా కూలిపోయి శిథిలావస్థలో ఉందని, కావున ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరుకు మనవి చేస్తూ దరఖాస్తు చేసుకున్నారు. లింగాల ఘనపురం మండలం, కుందారం గ్రామానికి చెందిన బత్తుల భిక్షపతి, తమ ఇంటి పక్కన ఇంటి వాళ్ళైన బత్తుల యాదయ్య, తండ్రి ఆగయ్యలు బర్లపెండ, ఇంటి వ్యర్థాలు అంతా తమ ఇంటి పక్కన వేయడంతో దుర్వాసన రావడం జరుగుతోందని, ఈ విషయంపై చర్యలు తీసుకోవాలని విన్నవిస్తూ దరఖాస్తును సమర్పించారు. జనగామకు చెందిన చిట్ల సుకన్య, తన 3 ఎకరాల 8 గుంటల భూమిని ధోరణిలో నమోదు చేయగా, తన వ్యవసాయ భూమి సర్వే నంబర్లు ఈ కు బదులు హెచ్ గా నమోదు అయ్యాయని, ఈ మేరకు తన వ్యవసాయ భూమి సర్వే నంబర్లు పరిశీలించి, వాటిని సరి చేయగరలని కోరుతూ దరఖాస్తును సమర్పించనైనది. నర్మెట్ట మండలం, బొమ్మకూరు గ్రామానికి చెందిన భూపతి ఆనందం, తన తల్లి పేరు మీద గల భూమి పాత పాస్ పుస్తకం నుంచి కొత్త పాస్ పుస్తకంకు కొంత తగ్గిందని, రెండు పాస్ పుస్తకాలను పరిశీలించి, మ్యుటేషన్ చేయగలరని, అలాగే తన పేరు మీదకు పట్టా చేయగలరని కోరుతూ దరఖాస్తును సమర్పించారు. ఈ ప్రజావాణిలో డీఆర్డీఓ భాస్కర్, గృహ నిర్మాణ శాఖ పీడీ మాతృ నాయక్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


# బోనాలకు ముస్తాబవుతున్న అమ్మవారి ఆలయాలు



**మేడిపల్లి,ఫ్లాష్ఇండియా ప్రతినిధి :** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ 9వ డివిజన్ మేడిపల్లిలో ఆగస్టు 9న నిర్వహించనున్న బోనాల ఉత్సవాల సందర్భంగా దేవాలయాలు ముస్తాబవుతున్నాయి. ఈ సందర్భంగా మేడిపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి మేడిపల్లిలోని మహంకాలమ్మ టెంపుల్, విష్ణు పురి ఎంక్లేవ్ లోని అమ్మవారి ఆలయాన్ని మరియు వివిధ దేవాలయాలను సందర్శించారు. ఆయా ఆలయాల కమిటీ సభ్యులతో కలిసి బోనాల ఏర్పాట్లను పరిశీలించిన ఆయన, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఆలయాల వద్ద పరిశుభ్రత, తాగునీరు, విద్యుత్ వెలుగులు, భద్రతతో పాటు ఇతర మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకోవాలని కమిటీ సభ్యులకు సూచించారు. బోనాల ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ఘనంగా జరుపుకోని విజయవంతం చేయాలని తుంగతుర్తి రవి కోరారు. ఈ కార్యక్రమం లో భాస్కర్, నాగరాజు,ప్రణయ్, శరత్,శానిటేషన్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# నిర్ణీత గడువు లోగా ఎస్ఐఆర్ కార్యక్రమం పూర్తి చేయాలి





**జనగాం,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమంలో అందుబాటులో ఉన్న సమయాన్ని పూర్తి స్థాయిలో వినియోగించి ఓటర్ల వివరాల డిజిటలైజేషన్‌ను వేగవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. సోమవారం, హైదరాబాద్ నుంచి ఎస్ఐఆర్ కార్యక్రమం పురోగతి, ఓటర్ల వివరాల డిజిటలైజేషన్, ఎన్యూమరేషన్ ప్రక్రియ తదితర అంశాలపై జిల్లాల ఎన్నికల అధికారులతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోంతో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఈ వీడియో కాన్ఫరెన్స్ కు హాజరయ్యారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ.. జిల్లాల కలెక్టర్లు క్షేత్ర-స్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపట్టి, నిర్ణీత గడువులోగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓటరు జాబితాలో డూప్లికేట్ ఎంట్రీలు, అనామలీస్, మ్యాపింగ్ సమస్యలు, డీఎస్ఈ/ఏఎస్డీ సంబంధిత అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలన్నారు. కుటుంబ సభ్యుల వివరాలను సమగ్రంగా పరిశీలించి ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు ఉండేలా చూడాలని సూచించారు. ఫోటో మిస్ మ్యాచ్ ఉన్న ఓటర్ల వివరాలను తప్పనిసరిగా పరిశీలించి సరి చేయాలని బీఎల్‌వోలకు ఆదేశించారు. 18 సంవత్సరాలు పూర్తి చేసిన అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయడానికి ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. బీఎల్‌వోలు, బీఎల్ఏలు సమన్వయంతో పనిచేస్తూ ప్రతి క్లెయిమ్, అభ్యంతరాన్ని నిబంధనల ప్రకారం పరిశీలించాలని సూచించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని తెలిపారు. సమావేశాల ఫోటోగ్రాఫ్, సంతకాలు, ఇతర వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. ప్రత్యేక సవ-రణ కార్యక్రమానికి సంబంధించిన షెడ్యూల్‌ను ఖచ్చితంగా పాటిస్తూ నిర్ణీత గడువులోపు అన్ని ప్రక్రియలను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అధికారులందరూ తమ మొబైల్ నంబర్లను సంబంధిత వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా నవీకరించుకోవాలని సూచించారు. పెండింగ్ డిజిటలైజేషన్ పురోగతి ఉన్న పోలింగ్ స్టేషన్లను ప్రత్యేకంగా గుర్తించి అక్కడ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ వీసీ అనంతరం సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ.. ఎన్యూమరేషన్ ఫారాలను క్షుణ్ణంగా పరిశీలించి, ఎలాంటి పొరపాట్లు లేకుండా బీఎల్‌ఓలు, సూపరవైజర్లు పర్యవేక్షించాలన్నారు. అలాగే రేషనలైజేషన్ (హేతుబద్ధీకరణ) ప్రతిపాదనలను శుక్రవారం లోగా సమర్పించాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఘనపూర్ (స్టేషన్) ఆర్డీఓ కిరణ్ ప్రకాష్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రిస్క్రిప్షన్ లేకుండానే మత్తు సిరప్ విక్రయం వెలుగులోకి

**కోదాడ,ఫ్లాష్ ఇండియా :** మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం మోపుతున్నమని కోదాడ టౌన్ పోలీసులు తెలిపారు. సోమవారం పట్టణంలోని టౌన్ పోలీస్ స్టేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. విశ్వసనీయ సమాచారం మేరకు ఆగస్టు 2వ తేదీ సాయంత్రం శ్రీరంగాపురంలోని దేగబాబు ఫంక్షన్ హాల్ సమీపంలోని చెట్ల వద్ద దాడులు నిర్వహించి, భారీగా గంజాయి, కోడైన్ కలిగిన టాసెక్స్ సిరప్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఏడుగురు నిందితులు, ముగ్గురు బాల నే-రస్తులను అదుపులోకి తీసుకోగా, మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కోదాడ పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ప్రధాన నిందితుడు మద్దే రవితేజ ఒడిశా రాష్ట్రంలోని మల్కనగిరి ప్రాంతం నుంచి గంజాయిని కొనుగోలు చేసి కోదాడకు తరలించి స్థానికంగా విక్రయిస్తున్నట్లు విచారణలో అంగీకరించాడు. అతని ద్వారా ఆవిడి రాఘవ, పంది వినోద్, షేక్ మగ్గం పాషా, షేక్ సుభాని అనే మెడికల్ షాప్ ఓనర్ ని, షేక్ ఇర్షాదు, తో పాటు నట్టే అనుదీప్ అనే వ్యక్తి పరారీలో ఉన్నట్లు తెలిపారు.

**ఈ సిరప్‌ను యువకులకు..**

గంజాయి సరఫరా జరుగుతున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ కేసు దర్యాప్తులో మరో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. వైరా రోడ్డులోని ఒక మెడికల్ షాపులో డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండానే కోడైన్ కలిగిన యూూజుశ సిరప్‌ను అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఒక్కో బాటిల్ గరిష్ట చిల్లర ధర రూ.279.69 ఉండగా, రూ.350 చొప్పున విక్రయిస్తున్నట్లు విచారణలో తేలింది. మత్తు కోసం ఈ సిరప్‌ను యువకులకు విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించి 38 సిరప్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంపై ప్రత్యేక దర్యాప్తు కొనసాగుతోంది. ఈ దాడుల్లో మొత్తం 6 కిలోల గంజాయి, ఒక హీరో గ్లామర్ మోటార్ సైకిల్, రెండు మొబైల్ ఫోన్లు, అలాగే 38 టాసెక్స్ సిరప్ బాటిళ్ల స్వా-ధీనం చేసుకున్నారు. ప్రతి బాటిల్‌లో కోడైన్ ఫాస్ఫేట్ ఉండటంతో మొత్తం సుమారు 9.12 గ్రాముల కోడైన్ ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ కేసులో గంజాయి సరఫరా గొలుసు, ఆర్థిక లావాదేవీలు, ఇతర నిందితుల పాత్రపై సమగ్ర దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.

**అక్రమ రవాణాకు సంబంధించిన..**

గంజాయి సరఫరాకు పాల్పడిన మరికొందరిని గుర్తించి త్వరలోనే అరెస్టు చేస్తామని వెల్లడించారు. అదుపులోకి తీసుకున్న నిందితులు, బాల నేరస్తులను న్యాయస్థానం ముందు హాజరుపరుస్తామని తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కోదాడ టౌన్ పోలీసులు మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయం, వినియోగాన్ని పూర్తిగా అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. డ్రగ్ ఫ్రీ సొసైటీ" లక్ష్యంగా విస్తృత స్థాయిలో నిఘా, తనిఖీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. మాదకద్రవ్యాల విక్రయం, వినియోగం లేదా అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం తెలిసిన ప్రజలు వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా సంబంధిత పోలీసు అధికారులకు తెలియజేయాలని, సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని పోలీసులు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ శివ శంకర్, ఎస్సై అజయ్ కుమార్, క్రైమ్ పార్టీ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ హరిలాల్ నాయక్, కానిస్టేబుల్ లు ఎక్కడ ప్రవీణ్, నాగేంద్రబాబు, లోకేష్ , శివకుమార్, నవీన్ తదితరులు పాల్గొన్నారు



## హాస్టల్‌లో 'సర్‌ప్రైజ్' తనిఖీ..!

**కొడంగల్,ఫ్లాష్ ఇండియా :** విద్యార్థులకు అందుతున్న భోజనం నిజంగా నాణ్యంగానే ఉందా..? హాస్టల్‌లో కల్పిస్తున్న వసతులు సంతృప్తికరంగానే ఉన్నాయా..? అనే అంశాలను స్వయంగా తెలుసుకునేందుకు కొడంగల్ మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్ సోమవారం ఆకస్మికంగా రంగంలోకి దిగారు. ఉడిమేశ్వరం గేట్ సమీపంలోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల, కళాశాలను మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్‌తో కలిసి సందర్శించి హాస్టల్ నిర్వహణపై సమగ్రంగా తనిఖీ నిర్వహించారు. ముందుగా వంటశాల, భోజనశాల, విద్యార్థులకు అందిస్తున్న ఆహార పదార్థాల నాణ్యత, వంట విధానం, తాగునీటి సౌకర్యం, హాస్టల్ గదులు, మరుగుదొడ్లు, పరిశుభ్రతను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో నేరుగా మాట్లాడి భోజనం రుచి, నాణ్యత, వసతులు, ఎదురవుతున్న సమస్యలపై ఆరా తీశారు. తనిఖీలతోనే సరిపెట్టకుండా విద్యార్థులతో కలిసి భోజనం చేసి అందిస్తున్న ఆహారాన్ని స్వ-యంగా పరిశీలించారు. హాస్టల్‌లోని ప్రతి విద్యార్థికి నాణ్యమైన, పోషకాహారం అందేలా చూడాలని, పరిశుభ్రత విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం సహించబోమని సంబంధిత అధికారులను హెచ్చరించారు. విద్యార్థుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, వారి ఆరోగ్యం, విద్యాభివృద్ధిపై ఎలాంటి రాజీ ఉండదని నందారం ప్రశాంత్ స్పష్టం చేశారు. గురుకులాలు, హాస్టళ్లలో ఆకస్మిక తనిఖీలు కొనసాగుతాయని, లోపాలు గుర్తిస్తే వెంటనే సరిదిద్దేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## వరుస బైక్ చోరీలకు చెక్.. ఇద్దరు దొంగలు అరెస్ట్



**హనుమకొండ,ఫ్లాష్ ఇండియా :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వరుసగా ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి సుమారు రూ.25 లక్షల విలువైన 28 మోటార్‌సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత తెలిపారు. సెంట్రల్ జోన్ డీసీపీ కవిత ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు చేపట్టి, మంచిర్యాల జిల్లాకు చెందిన దొంతుల ప్రశాంత్ కుమార్, దుర్గం సాయి కార్తీక్లను అదుపులోకి తీసుకున్నాయి. విచారణలో సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో తెలంగాణలోని పలు జిల్లాల్లో బైక్ చోరీలకు పాల్పడినట్లు నిందితులు అంగీకరించారు. నిందితుల సమాచారంతో కేయూసీ పోలీస్ స్టేషన్ పరిధిలోని మునిపల్లి శివారు, ఎలుకతుర్తి సమీప ప్రాంతాల నుంచి మొత్తం 28 మోటార్‌సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వీటిలో హోండా షైన్, హీరో స్ప్లెండర్ ప్లస్, హీరో గ్లామర్, హెచ్‌ఎఫ్ డీలక్స్, బజాజ్ పల్సర్, హోండా హార్నెట్ తదితర వాహనాలు ఉన్నాయి. ఈ బైక్‌లు వరంగల్ కమిషనరేట్‌లో 8, కరీంనగర్‌లో 9, రామగుండం--పెద్దపల్లిలో 3, సిద్దిపేటలో 2, హైదరాబాద్‌లో 3, రాచకొండలో 1, భూపాలపల్లి జిల్లాలో 2 చోరీ కేసులకు సంబంధించినవిగా పోలీసులు గుర్తించారు. కేసుల దర్యాప్తు కొనసాగుతోందని, వాహనాల అసలు యజమానులకు చట్టపరమైన ప్రక్రియ అనంతరం అప్పగిస్తామని సీపీ తెలిపారు. ఈ కేసును ఛేదించిన సీసీఎస్, కేయూసీ పోలీసు అధికారులు, సిబ్బందిని సీపీ అభినందించారు.

# కొత్త పేసర్ 'ఆకిబ్ నబీ' ఎంట్రీ..!



టీమిండియా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా గాయం కారణంగా శ్రీలంక పర్యటనకు దూరమయ్యాడు. దీంతో అతని స్థానాన్ని జమ్మూకశ్మీర్‌కు చెందిన యువ ఫాస్ట్ బౌలర్ 'ఆకిబ్ నబీ'ని జట్టులోకి ఎంపిక చేసున్నట్లు భారత క్రికెట్ నియంత్రణ మండలి (BCCI) ప్రకటించింది. ఆకిబ్ నబీకి భారత టెస్టు జట్టులో చోటు దక్కడం ఇదే మొదటిసారి. ఎడమ మోకాలి గాయం నుంచి బుమ్రా ఇంకా పూర్తిగా కోలుకోకపోవడంతో అతడికి విశ్రాంతి అవసరమని బీసీసీఐ వైద్య బృందం సూచించింది. దీంతో చివరి నిమిషంలో అతడిని శ్రీలంక టెస్టు సిరీస్‌కు దూరం చేయాల్సి వచ్చింది. బుమ్రా స్థానంలో ఎవరిని ఎంపిక చేస్తారనే ఉత్కంఠకు తెరదించుతూ సెలెక్టర్లు ఆకిబ్ నబీపై విశ్వాసం ఉంచారు. అయితే ఆకిబ్ నబీకి అవకాశం రావడానికి ప్రధాన కారణం.. దేశవాళీ క్రికెట్‌లో అతని అద్భుత ప్రదర్శనే. గత రెండు రణజీ ట్రోఫీ సీజన్లలో 104 వికెట్లు పడగొట్టి తానేంటో చెప్పకనే చెప్పాడు. ఇందులో 2025-26 సీజన్‌లో ఒక్క సీజన్‌లోనే 60 వికెట్లు తీసి జమ్మూకశ్మీర్‌కు తొలి రంజీ ట్రోఫీ టైటిల్ అందించడంలో కీలక పాత్ర పోషించాడు. ఈ మధ్యనే శ్రీలంక పర్యటనకు వెళ్లిన ఇండియా-ఆ జట్టులో కూడా ఆకిబ్ నబీ చోటు దక్కించుకున్నాడు. అక్కడ రెండు అనధికారిక టెస్టు మ్యాచ్‌ల్లో 6 వికెట్లు తీసి సెలెక్టర్ల దృష్టిలో పడ్డాడు. భారత జట్టు ఆగస్టు 4న శ్రీలంకకు బయలుదేరనుంది. అనంతరం ఆగస్టు 7 నుంచి కొలంబోలో మూడు రోజుల వార్మప్ మ్యాచ్ ఆడనుంది. టెస్టు సిరీస్‌లో తొలి మ్యాచ్ ఆగస్టు 15 నుంచి గాలేలో ప్రారంభం కానుండగా, రెండో టెస్టు ఆగస్టు 23 నుంచి కొలంబోలో జరగనుంది.


**శ్రీలంక పర్యటనకు భారత జట్టు:**
శుభ్‌మన్ గిల్ (C), కేఎల్ రాహుల్ (VC), యశస్వి జైస్వాల్, రిషభ్ పంత్ (WK), సాయి సుదర్శన్, ధ్రువ్ జురెల్, రవీంద్ర జడేజా, మానవ్ సుతార్, కుల్దీప్ యాదవ్, మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, ఆకిబ్ నబీ, గుర్‌నూర్ బరార్, దేవదత్ పడిక్కల్, సారాంశ్ జైన్.

# టీమిండియా కోచింగ్ స్టాఫ్‌లో భారీ మార్పు..



శ్రీలంకతో జరగనున్న టెస్టు సిరీస్‌కు ముందు భారత జట్టు కోచింగ్ స్టాఫ్‌లో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. గౌతమ్ గంభీర్ నేతృత్వంలోని టీమిండియా కోచింగ్ బృందంలో కొత్త ఫీల్డింగ్ కోచ్‌గా మాజీ అసోం, రైల్వేస్ క్రికెటర్ శుభదీప్ ఘోష్‌ను నియమించేందుకు బీసీసీఐ సిద్ధమైనట్లు సమాచారం. జింబాబ్వేతో జరిగిన టీ20 సిరీస్ అనంతరం టీ. దిలీప్ ఒప్పందాన్ని బీసీసీఐ పునరుద్ధరించకపోవడంతో ఆయన స్థానంలో ఘోష్ బాధ్యతలు చేపట్టనున్నాడు. శ్రీలంకతో టెస్టు సిరీస్‌నే ఆయన తొలి అసైన్‌మెంట్‌గా భావిస్తున్నారు. శుభదీప్ ఘోష్ 1994 నుంచి 2004 మధ్యకాలంలో మొత్తం 17 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు ఆడాడు. ఆటగాడిగా కెరీర్ ముగిసిన తర్వాత కోచ్‌గా తన ప్రతిభను నిరూపించుకున్నాడు. అసోం సీనియర్ పురుషుల జట్టుకు హెడ్ కోచ్‌గా పనిచేయడంతో పాటు నేషనల్ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ), భారత మహిళల జట్టు, ఇండియా-ఏ జట్లకు కూడా సేవలందించాడు. అంతేకాకుండా ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ జట్లతో కూడా పనిచేసిన అనుభవం ఉంది. శుభదీప్ నియామకాన్ని అసోం క్రికెట్ అసోసియేషన్ అధికారికంగా ధృవీకరించింది. భారత జట్లతో పనిచేస్తూ కోచ్‌గా మంచి గుర్తింపు తెచ్చుకున్న ఘోష్‌కు ఇది గొప్ప గౌరవమని అసోసియేషన్ పేర్కొంది. ఘోష్ నియామకం అసోం క్రికెట్‌కు గర్వకారణమని.. యువ క్రికెటర్లు, కోచ్‌లకు ఇది స్ఫూర్తిగా నిలుస్తుందని అధికారిక ప్రకటనలో వెల్లడించింది. గౌతమ్ గంభీర్ కోచింగ్ స్టాఫ్‌లో ఇటీవల పలు మార్పులు చోటుచేసుకున్నాయి. ఫీల్డింగ్ కోచ్ టీ. దిలీప్‌తో పాటు అసిస్టెంట్ కోచ్ ర్యాన్ టెన్ దస్కటే కూడా బాధ్యతల నుంచి తప్పుకున్నారు. ప్రస్తుతం బ్యాటింగ్ కోచ్‌గా సితాంశు కోటక్, బౌలింగ్ కోచ్‌గా మోర్నే మోర్కెల్ కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో శుభదీప్ ఘోష్ రాకతో కోచింగ్ బృందానికి మరింత బలం చేకూరుతుందని బీసీసీఐ భావిస్తోంది. టెన్ దస్కటే మళ్లీ కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టులో చేరాడు. నైట్ రైడర్స్ స్పోర్ట్స్‌కు 'హెడ్ ఆఫ్ క్రికెట్ స్ట్రాటజీ'గా నియమితుడయ్యాడు. ఈ బాధ్యతల్లో భాగంగా ప్రతిభావంతులైన ఆటగాళ్ల అన్వేషణ, జట్టు ప్రణాళిక, ఆటగాళ్ల ఎంపిక, పనితీరు విశ్లేషణ వంటి అంశాలను పర్యవేక్షించనున్నాడు. అలాగే ట్రిన్‌బాగో నైట్‌రైడర్స్, అబుదాబి నైట్‌రైడర్స్, లాస్ ఏంజెల్స్ నైట్‌రైడర్స్ జట్లకు అసిస్టెంట్ కోచ్‌గా కూడా సేవలందించనున్నాడు.



# కెప్టెన్‌గా హర్మన్‌ప్రీత్ వైస్ కెప్టెన్‌గా స్మృతి మందాన..!

మహిళల ఆసియా కప్ 2026 టోర్నీకి భారత క్రికెట్ నియంత్రణ మండలి భారత జట్టును అధికారికంగా ప్రకటించింది. హర్మన్‌ప్రీత్ కౌర్ మరోసారి జట్టుకు కెప్టెన్‌గా కొనసాగనుండగా.. స్టార్ ఓపెనర్ స్మృతి మందాన వైస్ కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ జట్టులో షెఫాలి వర్మ, జెమీమా రోడ్రిగ్స్, భారతి ఫుల్మాలీ, రిచా ఘోష్, దీప్తి శర్మ, రాధా యాదవ్ వంటి ప్రధాన ఆటగాళ్లు చోటు దక్కించుకున్నారు. అయితే స్పిన్నర్ శ్రేయాంక పాటిల్ కు మాత్రం నిరాశ ఎదురైంది. చీలమండ లిగమెంట్ గాయం నుంచి ఇంకా పూర్తిగా కోలుకోకపోవడంతో ఆమెకు ఆసియా కప్ జట్టులో చోటు దక్కలేదు. ఇదే గాయం కారణంగా ఆమె టీ20 ప్రపంచకప్‌ను కూడా మధ్యలోనే వీడాల్సి వచ్చింది. శ్రేయాంక పాటిల్ ఆసియా కప్‌కు దూరమైనప్పటికీ.. ఆసియా గేమ్స్ నాటికి పూర్తిగా కోలుకుని జట్టులోకి తిరిగి వచ్చే అవకాశం ఉందని సమాచారం. సెప్టెంబర్‌లో జరిగే ఆసియా గేమ్స్‌కు ఆమె అందుబాటులో ఉండే అవకాశాలు ఉన్నాయి. మహిళల ఆసియా కప్ 2026 షెడ్యూల్‌ను ఇప్పటివరకు ప్రకటించలేదు. ఈ టోర్నీ ఆగస్టు చివరి వారం నుంచి సెప్టెంబర్ మధ్య వరకు జరిగే అవకాశం ఉంది. ఆ తర్వాత సెప్టెంబర్ 17 నుంచి 22 వరకు ఆసియా గేమ్స్ నిర్వహించనున్నారు. స్టార్ ప్లేయర్స్ తో ఉన్న జట్టు.. ఈ టోర్నీలో టైటిల్ ఫేవరెట్‌గా నిలుస్తోంది. రిజర్వ్ జాబితాలో ప్రతీకా రావల్, ఉమా చేత్రీ, వైష్ణవి శర్మ, సయాలి సాత్‌ఘరే, మిన్ను మణి వంటి ప్రతిభావంతులైన ఆటగాళ్లు ఉండటం జట్టుకు అదనపు బలం.

**మహిళల ఆసియా కప్ 2026కు భారత జట్టు:**
హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మందానా (వైస్ కెప్టెన్), షెఫాలి వర్మ, జెమీమా రోడ్రిగ్స్, భారతి ఫుల్మాలీ, రిచా ఘోష్ (వికెట్ కీపర్), జి. కమలిని (వికెట్ కీపర్), దీప్తి శర్మ, రాధా యాదవ్, ప్రేమా రావత్, అరుంధతి రెడ్డి, క్రాంతి గౌడ్, రేణుకా సింగ్, ఎన్. శ్రీ చరణి, నందిని శర్మ.

**రిజర్వ్ ఆటగాళ్లు:**
ప్రతీకా రావల్, ఉమా చేత్రీ (వికెట్ కీపర్), వైష్ణవి శర్మ, సయాలి సాత్‌ఘరే, మిన్ను మణి.

## భారత్ కు ఎన్ని మెడల్స్ వచ్చాయి ?



**గ్లాస్గో వేదికగా కామన్వెల్త్ గేమ్స్ జరిగిన సంగతి తెలిసిందే. అయితే ఈ టోర్నమెంట్ లో భారత్ మొత్తం 39 మెడల్స్ సాధించింది. ఇందులో 13 గోల్డ్ ఉండగా, 17 సిల్వర్ మెడల్స్ ఉన్నాయి. మొత్తం తొమ్మిది కాంస్యం గెలుచుకుంది భారత్. ముఖ్యంగా బాక్సింగ్ విభాగంలో ఏకంగా ఏడు గోల్డ్ మెడల్స్ వచ్చాయి. ఈ క్రమంలోనే భారత ప్లేయర్లు సీజన్ బెస్ట్ నమోదు చేశారు.అయితే గతంలో కంటే ఈ సారి భారత్ కు తక్కువగానే మెడల్స్ వచ్చాయి. 2022లో జరిగిన కామన్ వెల్త్ గేమ్స్ సందర్భంగా భారత్ 61 మెడల్స్ గెలుచుకుంది. ఈ లెక్కన గతంలో కంటే, ఈ సారి 22 మెడల్స్ తగ్గాయి. 2026 కామన్వెల్త్ క్రీడలలో 39 పతకాలతో నాలుగో స్థానంలో నిలిచింది భారత్. ఆస్ట్రేలియాకు 171 మెడల్స్ రాగా, ఇంగ్లాండ్ 110 సాధించింది. కెనడా 62, భారత్ 39, స్కాట్లాండ్ 39 మెడల్స్ తో టాప్ 5లో నిలిచాయి.**

# బిజినెస్


## బిగ్ టెక్ కంపెనీలకు షాకిచ్చిన ఆస్ట్రేలియా..




సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్, సెర్చ్ ఇంజిన్లలో స్థానిక మీడియా సంస్థల వార్తలను ఫ్రీగా వాడుకుంటున్న బిగ్ టెక్ దిగ్గజాలకు ఆస్ట్రేలియా ప్రభుత్వం ఊహించని షాకిచ్చింది. స్థానిక న్యూస్ పబ్లిషర్లతో ఒప్పందాలు కుదుర్చుకుని వారికి డబ్బులు చెల్లించకపోతే, ఆయా కంపెనీలపై మల్టీ-మిలియన్ డాలర్ల చొప్పున భారీ పన్నులు విధించేందుకు సిద్ధమైంది. ఆస్ట్రేలియా సర్కార్ ప్రతిపాదించిన నూతన చట్టం ప్రకారం.. ఫేస్‌బుక్ మాతృసంస్థ 'మెటా' , గూగుల్ , టిక్‌టాక్ వంటి టెక్ దిగ్గజాలు తమ వార్షిక స్థానిక ఆదాయంలో 2.25 శాతం మీడియా సంస్థలకు పన్నును చెల్లించాల్సి ఉంటుంది. అయితే, స్థానిక మీడియా సంస్థలతో స్వచ్ఛందంగా వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకుని, వార్తలకు తగిన పరిహారం చెల్లిస్తే ఈ పన్ను నుంచి మినహాయింపు లభిస్తుంది.

**ప్రభుత్వం, టెక్ కంపెనీల రియాక్షన్ ఇదే..**
తాజాగా తీసుకొచ్చిన 'న్యూస్ బార్గేనింగ్ ఇన్సెంటివ్ లెవీ' చట్టంపై ఆస్ట్రేలియా కమ్యూనికేషన్స్ మంత్రి అనికా వెల్స్ మాట్లాడుతూ.. ప్రజలు ఎక్కువగా సోషల్ మీడియా, గూగుల్ ద్వారానే వార్తలు చదువుతున్నారని అన్నారు. డిజిటల్ ప్లాట్‌ఫామ్స్ రాబడిని పెంచుతున్న జర్నలిజానికి ఆయా కంపెనీలు తగిన మూల్యం చెల్లించడమే న్యాయమని తెలిపారు. అగ్రిమెంట్లు కుదుర్చుకోకపోతే టెక్ కంపెనీలు ప్రభుత్వానికి మరింత ఎక్కువ మొత్తంలో పన్నులు చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. కాగా, ఆస్ట్రేలియా ప్రభుత్వ ప్రతిపాదనలను మెటా, గూగుల్ తీవ్రంగా ఖండిస్తున్నాయి. వినియోగదారులు కేవలం వార్తల కోసం తమ ప్లాట్‌ఫామ్‌లకు రారని, పైగా పబ్లిషర్లే తమ కథనాల ప్రచారం కోసం ఉచితంగా పోస్ట్ చేస్తున్నారని మెటా పేర్కొంది. ఈ నిధుల ద్వారా ఆస్ట్రేలియాలోని స్థానిక జర్నలిజం, మీడియా సంస్థలను బలోపేతం చేయడమే తమ ప్రధాన లక్ష్యమని ప్రభుత్వం స్పష్టం చేసింది.

# పెరిగిన బంగారం ధరలు..




ఈ రోజు (సోమవారం) బంగారం ధరలు స్వల్పంగా పెరిగాయి. 10 గ్రాముల 24.. 22..18 క్యారెట్ల బంగారంపై 10 రూపాయల చొప్పున పెరిగింది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం.. ఉదయం 11 గంటల ప్రాంతంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర 1,44,220 రూపాయల వద్ద.. 22 క్యారెట్ల బంగారం ధర 1,32,200 రూపాయల వద్ద.. 18 క్యారెట్ల బంగారం ధర 1,08,160 రూపాయల వద్ద ట్రేడ్ అవుతోంది.

# ఫుడ్ డెలివరీ రేసులోకి...




వాల్‌మార్ట్ యాజమాన్యంలోని ఫ్లిప్‌కార్ట్.. స్విగ్గీ, జొమాటోలకు పోటీగా బెంగళూరులో త్వరలోనే తన ఫుడ్ డెలివరీ సేవలను ప్రారంభించేందుకు సిద్ధమవుతోంది. ఆగస్టు 15 నాటికి ఈ సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. దీనికోసం కంపెనీ ఇప్పటికే నగరవ్యాప్తంగా ఉన్న రెస్టారెంట్ భాగస్వాములను చేర్చుకోవడం ప్రారంభించింది. ఇతర ప్లాట్‌ఫారమ్‌లు సాధారణంగా 16 నుంచి 30 శాతం వరకు కమిషన్ వసూలు చేస్తుండగా, ఫ్లిప్‌కార్ట్ మాత్రం కేవలం 10 శాతం కమిషన్‌నే ఆఫర్ చేస్తూ రెస్టారెంట్లను ఆకట్టుకుంటోంది. కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ (ాచీణజ) ఆధారంగా ఫ్లిప్‌కార్ట్ ఈ సేవలను అందిస్తోంది. ఈ ఫుడ్ డెలివరీ సేవలు ఫ్లిప్‌కార్ట్ ప్రధాన యాప్‌తో పాటు, ప్రత్యేకంగా ఉండే ఒక స్టాండ్‌అలోన్ యాప్ ద్వారా కూడా వినియోగదారులకు అందుబాటులో ఉంటాయి. ప్రస్తుతం ఫ్లిప్‌కార్ట్ జజూా కళ్యాణ్ కృష్ణమూర్తి మాజీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ ఆశిష్ విజయ్‌వర్గియా ఈ ప్రాజెక్ట్‌కు నాయకత్వం వహిస్తున్నారు. ఇటీవల రాపిడో 'ఓన్లీ' పేరుతో జీరో-కమిషన్ మోడల్‌లో రోజుకు 40,000 పైగా ఆర్డర్లతో బెంగళూరు మార్కెట్లో వేగంగా దూసుకుపోతోంది. ఈ నేపథ్యంలో ఫ్లిప్‌కార్ట్ తక్కువ కమిషన్ వ్యూహంతో మార్కెట్లోకి అడుగుపెట్టడం విశేషం. ప్రారంభంలో బెంగళూరులో పరిమిత వినియోగదారులతో ఈ సేవలను పైలట్ ప్రాజెక్ట్‌గా పరీక్షించి, వినియోగదారుల ఫీడ్‌బ్యాక్ ఆధారంగా ఇతర నగరాలకు విస్తరించాలని సంస్థ భావిస్తోంది. గత కొంతకాలంగా స్విగ్గీ, జొమాటోల మధ్య మాత్రమే సాగుతున్న ఫుడ్ డెలివరీ పోటీలోకి రాపిడో, ఇప్పుడు ఫ్లిప్‌కార్ట్ వంటి దిగ్గజాలు రావడం ఈ రంగాన్ని మరింత ఆసక్తికరంగా మార్చింది.



# యస్ చెబితేనే నగదు బదిలీ..

డిజిటల్ చెల్లింపుల్లో మోసాలను అరికట్టేందుకు బ్యాంకులు కొత్త ఫీచర్‌ను ప్రతిపాదించాయి. యూపీఐ ట్రాన్సాక్షన్‌కు సంబంధించి 'యస్' ఆప్షన్‌ను ఎంచుకున్నాకే నగదు బదిలీ అయ్యేలా కొత్త ఫీచర్ అమల్లోకి తేవాలన్న ప్రతిపాదనను ఆర్బీఐ ముందుంచినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ప్రస్తుతం బయోమెట్రిక్ ఆథెంటికేషన్, లేదా పిన్ నంబర్ ఎంటర్ చేశాక నగదు బదిలీ జరుగుతోంది. దీనికి అదనంగా యస్ ఫీచర్‌ను కూడా అందుబాటులోకి తెస్తే భద్రత మరింత పెరుగుతుందని బ్యాంకులు భావిస్తున్నాయి. అయితే, హైరిస్క్ లావాదేవీలకు మాత్రమే ఈ ఫీచర్ వర్తింప చేస్తామని బ్యాంకులు చెబుతున్నాయి. ఈ అంశాన్ని ఆర్బీఐ పరిశీలిస్తోంది.

**ఫీచర్ పనితీరు ఇలా..**
అనుమానాస్పదంగా ఉన్న నగదు బదిలీని బ్యాంకుల్లోని ఫ్రాడ్ డిటెక్షన్ ఇంజన్‌లు గుర్తిస్తాయి. అనంతరం కస్టమర్ ఫోన్‌లో ఒక పాప్ అప్ విండో ప్రత్యక్షం అవుతుంది. బదిలీకి అనుమతించేందుకు యస్ ఆప్షన్, వద్దనేందుకు నో ఆప్షన్ ఈ విండోలో ఉంటాయి. యస్ ఆప్షన్‌ను ఎంచుకున్నాకే నగదు బదిలీ పూర్తవుతుంది. బ్యాంకు దృష్టిలో హైరిస్క్ లావాదేవీలకు మాత్రమే వర్తించేలా ఈ ఫీచర్‌ను డిజైన్ చేయనున్నారు.

**కొత్త మార్గాల్లో సైబర్ నేరాలు..**
ఇటీవల కాలంలో యూపీఐ చెల్లింపులకు సంబంధించి మోసాలు పెరుగుతున్న వైనాన్ని బ్యాంకులు గుర్తించాయి. నేరగాళ్లు హ్యాకింగ్‌కు బదులు బాధితుల్ని ప్రభావితం చేసి డబ్బుల్ని దండుకోవడానికి అలవాటు పడ్డారు. ఫోన్ కాల్స్, మెసేజీ యాప్‌ల ద్వారా యూజర్లను సంప్రదించి తక్షణ బదిలీకి ఒత్తిడి చేసి డబ్బును దోచుకుంటున్నారు. చాలా సందర్భాల్లో నగదు అకౌంట్ నుంచి బదిలీ అయ్యాక తిరిగి పొందే అవకాశం తక్కువగా ఉంటుంది. దీంతో, బాధితులు మోసం జరిగిందని గుర్తించే సరికి చాలా ఆలస్యం జరుగుతోంది. ఈ నేపథ్యంలో కస్టమర్లకు ఈ ఆప్షన్‌ను అందుబాటులోకి తెస్తే వారు క్షణకాలం పాటైనా ఆగి తమ చర్యలను పునఃసమీక్షించుకుని తగు నిర్ణయం తీసుకుంటారని బ్యాంకులు భావిస్తున్నాయి. వేగవంతమైన నగదు బదిలీల కారణంగా యూపీఐ అందరికీ చేరువైంది. కాబట్టి, యూపీఐకి ఉన్న జనాదరణ తగ్గకుండా ఉండేందుకు హైరిస్క్ ట్రాన్సాక్షన్స్‌కే ఈ ఫీచర్‌ను వర్తించాలని బ్యాంకులు భావిస్తున్నట్టు సమాచారం.

# గెలిచేది మహిళలే



కన్నడ రాకింగ్ స్టార్ యష్, కియారా అద్వానీ జంటగా నటిస్తున్న భారీ ప్రాజెక్ట్ 'టాక్సిక్' . పలు వాయిదాల తర్వాత ఈ చిత్రాన్ని ఆగస్ట్ 26న థియేటర్స్‌లోకి తీసుకురాబోతున్నారు మేకర్స్. అయితే ఈ సినిమా ప్రకటన వెలువడిన నాటి నుంచి విడుదలవుతున్న ప్రతి ఒక్క అప్‌డేట్ తీవ్ర వివాదాస్పదంగా మారడం, అలాగే వరుస విమర్శలను ఎదుర్కోవడం సినీ పరిశ్రమలో పెద్ద ఎత్తున చర్చ-నీయాంశంగా మారింది. ఇటీవల ఈ సినిమా నుంచి విడుదల చేసిన 'తబాహి' సాంగ్ సోషల్ మీడియాలో తీవ్ర వివాదానికి దారితీసింది. ఈ పాటలో యష్, కియారా అద్వానీల మధ్య చిత్రీకరించిన రొమాంటిక్ సన్నివేశాలు కాస్త అభ్యంతరకరంగా ఉన్నాయంటూ నెటిజన్లు పెద్ద ఎత్తున ట్రోల్ చేయడం ప్రారంభించారు. అంతేకాకుండా సినిమాలో కియారా చేసిన గ్లామర్ షోపై కూడా నెటిజన్లు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. ఈనేపథ్యంలో తాజాగా, ఈ నెగెటివిటీ, ట్రోలింగ్ వ్యవహారంపై ఈ చిత్రంలో ఒక కీలక పాత్రలో కనిపించబోతున్న నటి హుమా ఖురేషి స్పందిస్తూ సంచలన వ్యాఖ్యలు చేశారు.సోషల్ మీడియాలో ఇలా ట్రోలింగ్ చేయడం అనేది చాలా వికృతమైన, అసహ్యకరమైన విషయమని ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే ఈ చిత్రంలో పనిచేసిన మహిళలు అంటే నటీమణులు, దర్శకురాలు గీతూ మోహన్‌దాస్.. చివరకు ఖచ్చితంగా విజయం సాధిస్తారనే బలమైన నమ్మకం తనకు ఉందని స్పష్టం చేశారు. ప్రతి చిన్న విషయానికి సమాధానం ఇస్తూ దేనినీ సమర్థించుకోవడంలో ఎలాంటి అర్థం లేదని, కేవలం మాటలతో ప్రజల ఆలోచనా విధానాన్ని ఎప్పటికీ మార్చలేమని అన్నారు. అందుకే సినిమా విడుదలయ్యాక తన పని తాను చేసుకుంటూ, తన గురించి తానే మాట్లాడేలా వదిలేయడమే మంచిదని హుమా అన్నారు. 'కేజీఎఫ్' వంటి ప్రభంజనం తర్వాత యష్ నటిస్తున్న ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌కు గీతూ మోహన్‌దాస్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో కియారా, నయనతార, తారా సుతారియా, రుక్మిణి వసంత్, హుమా ఖురేషి లాంటి ఐదుగురు స్టార్ నటీమణులు నటిస్తున్నారు. వరుస కాంట్రవర్సీల్లో చిక్కుకుంటూ విమర్శలు ఎదుర్కొంటున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి.

# 'స్పైడర్ మ్యాన్' కలెక్షన్ల సునామీ.. 4 రోజుల్లో ఎన్ని కోట్లంటే!

టామ్ హాలండ్ హీరోగా వచ్చిన స్పైడర్ మ్యాన్ సినిమా సంచలనం సృష్టిస్తోంది. కలెక్షన్స్ లో ఈ సినిమా దూసుకుపోతోంది. ఇండియాలో రిలీజ్ అయిన ఈ స్పైడర్ మ్యాన్, కేవలం నాలుగు రోజుల్లో రూ.300 కోట్ల గ్రాస్ రాబడినట్లు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఇక శనివారం ఈ సినిమా రూ. 84 కోట్లు వసూలు చేయగా... ఆదివారం రూ.90 కోట్లు దాటినట్లు చెబుతున్నారు. ఈ క్రమంలోనే రూ. 300 కోట్లు ఇప్పటికే దాటి ఉంటుందని అంచనా వే-స్తున్నారు.మరో వైపు ప్రపంచ వ్యాప్తంగా రూ.8842 కోట్ల కలెక్షన్స్ ఈ సినిమా రాబట్టింది. అవెంజర్స్ ఎండ్ గేమ్ తర్వాత తొలి వారాంతంలో అత్యధిక వసూళ్లు రాబట్టిన రెండవ సినిమాగా స్పైడర్ మ్యాన్ నిలిచింది. మరో రెండు రోజుల్లోనే రూ.500 కోట్లు కూడా క్రాస్ అవుతుందని అంచనా వేస్తున్నారు. ఇది ఇలా ఉండగా జూలై 30వ తేదీన ఇండియాలోని థియేటర్లలో ఈ సినిమా రిలీజ్ అయింది. అమెరికా కంటే ఒకరోజు ముందుగానే ఇండియాలో రిలీజ్ కావడం గమనార్హం.




# నాని నిర్మాతగా 'రుక్మిణీ'




నేచురల్ స్టార్ నాని ప్రొడ్యూసర్‌గా, యూత్ స్టార్ నితిన్ హీరోగా ఒక క్రేజీ కాంబినేషన్ సెట్ అయింది. 'కోర్ట్' సినిమాతో నిర్మాతగా బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకుని టాలీవుడ్‌లో స్టార్ ప్రొడ్యూసర్ స్టేటస్ సొంతం చేసుకున్న నాని, తన స్వంత నిర్మాణ సంస్థ వాల్‌పోస్టర్ సినిమాస్ బ్యానర్‌పై ఈ ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కించారు. 'దండోరా' చిత్రంతో గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు మురళి కాంత్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు.ఈ చిత్రానికి 'అలియాస్ రుక్మిణీ' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేస్తూ చిత్రబృందం ఒక చిన్న అనౌన్స్‌మెంట్ వీడియోను విడుదల చేసింది. ఈ వీడియో మరియు టైటిల్ చూస్తుంటేనే సినిమా ఎంతటి క్లాసిక్, ప్లెజెంట్ లవ్ అండ్ ఎంటర్‌టైనింగ్ వైబ్‌తో రాబోతోందో స్పష్టమవుతోంది. గత కొంతకాలంగా మాస్, యాక్షన్ జోనర్లలో ప్రయత్నాలు చేసిన నితిన్.. ఈసారి తన బలమైన 'రొమాంటిక్-కామెడీ / ఫ్యామిలీ' జోనర్‌లోకి మళ్లీ అడుగుపెట్టారు. నితిన్ కెరీర్‌లోనే ప్రత్యేకంగా నిలిచేలా ఈ ప్రాజెక్ట్ రూపొందనుందని టాక్. నితిన్‌కు గ్రాండ్ కంబ్యాక్ ఇచ్చే కంటెంట్ ఇందులో ఉందని ఇన్సైడ్ వర్గాల సమాచారం. నిర్మాతగా ఎప్పుడూ వైవిధ్యమైన, కొత్త తరహా కథలనే ఎంచుకునే నానికి ఈ సబ్జెక్ట్ ఎంతగానో నచ్చడంతో స్వయంగా నిర్మించడానికి ముందుకు వచ్చారు. ప్రొడ్యూసర్‌గా వంద శాతం సక్సెస్ రేట్ ఉన్న నాని జడ్జ్‌మెంట్‌పై ప్రేక్షకుల్లో విపరీతమైన నమ్మకం ఉంది. దీంతో నితిన్ - నాని - మురళి కాంత్ కాంబినేషన్‌లో రాబోతున్న 'అలియాస్ రుక్మిణి' పై అప్పుడే సినీ ప్రియుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.



# రెండు చేతులు కలిస్తేనే చప్పట్లు..

టాలీవుడ్ యంగ్ హీరోయిన్ శ్రీగౌరీప్రియ ముందుగా క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా నటించి మంచి ఫేమ్ రాబట్టుకున్నారు. తెలుగులో తొలినాళ్లలో అనుకున్నంత అవకాశాలు రాకపోవడంతో 'లవర్' సినిమాతో కోలీవుడ్‌కు ఎంట్రీ ఇచ్చి తన నటనతో మంచి ఫేమ్ సంపాదించుకుంది. ఆ తర్వాత తెలుగులో 'శ్రీకారం', 'రైటర్ పద్మభూషణ్', 'మ్యాడ్' వంటి సూపర్ హిట్ సినిమాల్లో నటించి ఆకట్టుకుంది. ఇటీవల వచ్చిన 'చెన్నై లవ్ స్టోరీ' చిత్రంతో మరో బ్లాక్ బస్టర్ హిట్ తన ఖాతాలో వేసుకుంది. ఈ సినిమాలో ఆమె చూపించిన నటనకు ప్రేక్షకులతో పాటు పలువురు సినీ సెలబ్రిటీలు సైతం ఫిదా అయిపోయి ప్రశంసల వర్షం కురిపించారు.వరుస విజయాలతో దూసుకుపోతున్న శ్రీగౌరీప్రియ తాజాగా ఓ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో క్యాస్టింగ్ కౌచ్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది."నేను నమ్మేది ఒకటే.. రెండు చేతులు కలిస్తేనే చప్పట్లు వస్తాయి. మనిషి అన్నాక పూర్తి క్లారిటీ ఉండాలి, మనకి ఏం కావాలో సరిగ్గా తెలియాలి. అది సరిగ్గా డిసైడ్ అయితే మనల్ని దాటి ఎవరూ ఏమీ చేయలేరు. కెరీర్‌లో ధైర్యం, క్లారిటీ చాలా ముఖ్యం, నాకు ఆ రెండూ ఉన్నాయి" అని స్పష్టం చేసింది. అలాగే తన ప్రాజెక్ట్‌ల ఎంపిక, మనీ మేనేజ్‌మెంట్ గురించి మాట్లాడుతూ.. "కథ బాగుండాలి, సినిమా బాగుండాలి, అందులో నేను బాగుండాలి.. ఈ మూడు కలిసొచ్చే సినిమాలే చేస్తాను. నేను కేవలం నాలోని నటిని మాత్రమే చూపిస్తూ పోతే ఆఫర్లు ఎలా వస్తాయి? నటనతో పాటు డబ్బులు కూడా సంపాదించాలి కదా! డబ్బులు వద్దు, కేవలం మంచి సినిమాలే చేస్తానంటే కుదరదు కదా" అని అన్నారు. ఇక తన కెరీర్, పెళ్లి గురించి స్పందిస్తూ.. ప్రస్తుతం తన పూర్తి ఫోకస్ నటనపైనే ఉందని, ఇప్పట్లో పెళ్లి చేసుకునే ఆలోచన ఏదీ లేదని, కానీ భవిష్యత్తులో ఖచ్చితంగా చేసుకుంటానని చెప్పింది.




# హిట్టు కొట్టేదెవరు?

2026లో అప్పుడే 7 నెలలు గడిచిపోయాయి. ఫస్టాఫ్‌లో సంక్రాంతికి వచ్చిన సినిమాలు శాటిస్పై చేయగలిగాయి. సమ్మర్ వృథాగా పోయింది. జూన్, జులైలో ఎన్నో అంచనాలతో వచ్చిన కొన్ని సినిమాలు బాక్సాఫీస్ దగ్గర అదుపు తపా-్పయి. ఇంకొన్ని డివైడ్ టాక్ వచ్చినప్పటికీ తట్టుకుని నిలబడ్డాయి. గత ఏడాది ఆగస్టులో టాలీవుడ్ నుండి చెప్పుకోదగ్గ సినిమాలేవీ రాలేదు. ఇండిపెండెన్స్ డే హాలీడేస్‌కు కూలీ అండ్ వార్2 చిత్రాలను తేల్చుకోమని వదిలేసింది తెలుగు ఇండస్ట్రీ.కానీ ఈ ఆగస్ట్ నిరుడు లెక్క ఉ ండదు. రోలర్ కోస్టర్ ఎంటర్టైన్మెంట్స్ రెడీ అవుతున్నాయి. ఫస్ట్ వీక్‌లో హారర్ కామెడీతో వస్తున్నాడు వరుణ్ తేజ్. ఆగస్ట్ 7న రిలీజౌతోంది కొరియన్ కనగరాజ్. మేర్లపాక గాంధీ దర్శకుడు అదే రోజు కింగ్ జాకీ క్వీన్ అంటూ రైజింగ్ హీరోస్ మెగాహీరోతో పోటీపడుతున్నారు. ఆగస్ట్‌లో సెకండ్ వీకెండ్ చాలా కీలకం. ఇండిపెండెన్స్ డే టార్గెట్ చేస్తూ టాలీవుడ్ నుండి చిన్న సినిమాలు వస్తున్నాయి. అన్నపూర్ణ స్టూడియో నిర్మాణ సారథ్యంలో తెలంగాణ బ్యాక్ డ్రాప్ కోర్టు రూమ్ డ్రామా పళ్ల బురుసు అదే రోజు వస్తుండగా, వన్స్ ఆపాన్ ఎ టైమ్ సక్సెస్ ఫుల్ నిర్మాత ఎంఎస్ రాజు దర్శకుడిగా వ్యవహరిస్తున్న హారర్ మూవీ అగధ ఆగస్ట్ 14న ప్రేక్షకుల ముందుకు వస్తుంది.థర్డ్ ఫ్రైడే డివోషనల్ వీక్. మాస్ మహారాజ్ రవితేజ ఇరుముడితో సరికొత్తగా కనిపించేందుకు ట్రై చేస్తున్నాడు. శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ మూవీ ఆగస్ట్ 21న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఆగస్ట్ లాస్ట్ ఫ్రైడేకు శర్వానంద్ భోగితో రావాల్సి ఉంది.. కానీ ఇప్పటి వరకు టీజర్ కానీ గ్లింప్స్ కానీ రిలీజ్ చేయలేదు. అఫీషియల్‌గా పోస్ట్ పోన్ కాదు కానీ.. అన్ అఫీషియల్‌గా ఆగస్ట్ 28న సినిమా వచ్చే ఛాన్స్ లేదనేది టీఎఫ్ఐలో వినిపిస్తున్న మాట.

# కాస్టింగ్ కౌచ్ బాధలు కూడా తప్పలేదు



వరుస అవకాశాలతో కెరీర్‌ను విజయవంతంగా ముందుకు సాగిస్తున్న నటుల్లో విజయ్ వర్మ ఒకరు. ప్రస్తుతం నటుడిగా మంచి గుర్తింపు పొందిన ఆయన, కెరీర్ ప్రారంభంలో ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నానని తాజాగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. విజయ్ వర్మ మాట్లాడుతూ.. సినీ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టే సమయంలో ఎన్నో ఇబ్బందులు ఎదురయ్యాయి. హైదరాబాదులో ఉన్నప్పుడు నటనతో పాటు మోడలింగ్ రంగంలోనూ అవకాశాల కోసం ప్రయత్నించాను. ఆ సమయంలో ఓ మోడల్ కోఆర్డినేటర్ నాతో అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో ఒక్కసారిగా షాక్‌కు గురయ్యాను. అయితే భయపడకుండా వెంటనే అతడిని నిలదీశాను.దాంతో అతడు వెనక్కు తగ్గాడని తెలిపారు. కొత్తగా ఏ రంగంలోనైనా అడుగుపెట్టే వారికి ఇలాంటి చేదు అనుభవాలు ఎదురైతే చాలా మంది భయపడి వెనక్కు తగ్గుతారు. కానీ నేను మాత్రం నా లక్ష్యాన్ని వదులుకోలేదు. కచ్చితంగా నటుడిని కావాలనే సంకల్పంతో మరింత పట్టుదలగా ప్రయత్నాలు కొనసాగించాను. ఆ క్రమంలో హైదరాబాదులోని 'సూత్రధార్ స్కూల్ ఆఫ్ యాక్టింగ్'లో చేరాలని అనుకున్నాను. అయితే మొదట అక్కడ కూడా నన్ను తిర-స్కరించారు. అయినప్పటికీ నిరాశ చెందకుండా కష్టపడి, నేడు నటుడిగా మంచి గుర్తింపును సంపాదించుకున్నానని విజయ్ వర్మ చెప్పుకొచ్చారు.

# పూర్వ వైభవం సంతరించుకోవాలి..



బాలీవుడ్ సీనియర్ నటుడు సంజయ్ దత్ చిత్ర పరిశ్రమలో వచ్చిన మార్పులపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తన కెరీర్ తొలినాళ్లలో సినీ పరిశ్రమ ఒక కుటుంబంలా ఉండేదని, అందరూ కలిసికట్టుగా ఉంటూ ఒకరికొకరు సహాయం చేసుకునేవారని తెలిపారు. కానీ ఇప్పుడు బాలీవుడ్ చాలా కఠినంగా, విపరీతమైన పోటీతత్వంతో మారిపోయిందని విచారం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఈ పరిశ్రమ మళ్లీ తన పూర్వ వైభవాన్ని, ఐక్యతను సంతరించుకుంటుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా బాలీవుడ్‌లోని ప్రస్తుత వాతావరణాన్ని హాలీవుడ్‌తో పోలుస్తూ సంజయ్ దత్ కొన్ని కీలక విషయాలు పంచుకున్నారు. హాలీవుడ్‌లో నటీనటులు, రచయితలు ఎంతో ఐకమత్యంగా ఉంటారని, అక్కడ ఆరోగ్యకరమైన పోటీ మాత్రమే కనిపిస్తుందని తెలిపారు. ప్రతిఒక్కరికీ అండగా నిలిచే బలమైన పరిశ్రమ సంస్థలు హాలీవుడ్‌లో ఉ న్నాయని పేర్కొన్నారు. ఆస్కార్ లాంటి పెద్ద వేదికలపై కూడా ఒక నటుడు అవార్డు అందుకుంటున్నప్పుడు ఇతరుల్లో ఎలాంటి అసూయ ఉండదని, అందరూ మనస్ఫూర్తిగా అభినందిస్తారని చెప్పారు. హాలీవుడ్ సెలబ్రిటీలలో ఉండే ఆ ఐక్యత, ఒకరికొకరు ఇచ్చుకునే మద్దతు ఎంతో అందంగా ఉ ంటాయని సంజయ్ దత్ అభిప్రాయపడ్డారు.

Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**